## నేటి కందం-నేటికి అందం

లీలగ మైక్రో సాప్టే
లాలింపగ భాగ్య నగర ప్రాంతము లోనన్
నాలుగవ క్లౌడు సీమను
పాలకుడగు ముఖ్య మంత్రి ప్రారంభించెన్ !!

(మైక్రోసాఫ్ట్ వారి నాలుగవ క్లౌడ్ రీజియన్ ను హైదరాబాద్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఇది హైదరాబాద్ నగరానికి మరో కలికితురాయి అవుతుంది అని అందరూ ప్రశంసిస్తున్నారు.)



-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com　ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433　E-mail:netinijam93@gmail.com



## చురక

క్యా బోల్తీ పబ్లికంటూ
కాక్రోచులు దేశమంతా
సర్కారును నిలదీసే
చైతన్యపు పాలపుంత
అనుకుంటే నీటి చుక్క
అణువంత బిందువే
జతకూడితే పోటెత్తే
జలప్రళయం సింధువే




-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ ఆదివారం 9-8-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక: 6 పేజీలు:6 వెల: రూ.1/-


# నేనేమీ బాబా బాగేశ్వర్‌ను కాదు..

## ఐఐటీ ఢిల్లీ విద్యార్థులను నవ్వించిన ప్రధాని





న్యూఢిల్లీ, ఆగష్టు 8: ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ ఢిల్లీ (ఆవశ్రీప్త్రతి) లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువు బాబా బాగేశ్వర్ (ధీరేంద్ర కృష్ణ శాస్త్రి) పేరును ప్రస్తావించి సభలో నవ్వులు పూయించారు. విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. వారి మనసులోని ఆలోచనలను సరదాగా ఊహించి చెప్పారు.

'మీరంతా ఈ రోజు ఇక్కడ సమావేశమయ్యారు. కానీ మీ మనసుల్లో ఎన్నో ఆలోచనలు మెదులుతూ ఉంటాయి. నేనేం బాబా బాగేశ్వర్‌ను కాదు, కానీ మీ మదిలో ఏముందో ఊహించగలను. కొందరు భవిష్యత్తు గురించి, మరికొందరు జీతాల గురించి, ఇంకొందరు కొత్త నగరంలో కొత్త జీవితం గురించి, మరికొందరు స్టార్టప్‌ల గురించి ఆలోచిస్తుండవచ్చు' అని మోదీ సరదాగా వ్యాఖ్యానించడంతో విద్యార్థులు, అధ్యాపకులు చప్పట్లతో హర్షం వ్యక్తంచేశారు.

ఈ వేడుకలో మూడు వేల మందికిపైగా విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. 'ఈ రోజు మీ కుటుంబసభ్యులు ఎంత గర్వపడుతున్నారో నేను కూడా మీ గురించి అంతే గర్విస్తున్నా. మీరు కేవలం డిగ్రీలు అందుకోవట్లేదు, దేశం కోసం ఏదైనా సాధించాలనే కలను ముందుకు తీసుకెళుతున్నారు' అని విద్యార్థులను అభినందించారు. ప్రతి ఒక్కరి మార్గం, కలలు వేర్వేరుగా ఉన్నప్పటికీ ఐఐటీలో చేరిన మొదటి రోజు నుంచి ఈ స్నాతకోత్సవం వరకు సాగిన ప్రయాణం ప్రతి ఒక్కరిలో సంతృప్తిని నింపుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా అకడమిక్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రెసిడెంట్స్ గోల్డ్ మెడల్, డైరెక్టర్స్ గోల్డ్ మెడల్ వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలను ప్రధాని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన సరదాగా స్పందిస్తూ.. 'ప్రతిభావంతులైన విద్యార్థుల్లో కొంతమంది ఆడపిల్లలు ఉంటే బాగుండేది. క్షమించాలి కొందరు కాదు, చాలామంది ఉండాలి' అని వ్యాఖ్యానించడంతో సభలో మరోసారి నవ్వులు విరిశాయి.

అనంతరం ఐఐటీ సోనిపట్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన 'పరం ప్రజ్ఞ' అనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత హై-పెర్ఫార్మెన్స్ సూపర్ కంప్యూటింగ్ కేంద్రాన్ని ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సదుపాయం ఏఐ, డేటా సైన్స్, అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ రంగాల్లో ఐఐటీ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు. జీవితంలో వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు క్యాంపస్ జీవితం, స్నేహితులు, గురువులు ఎప్పటికీ గుర్తుండిపోతారని మోదీ సూచించారు.

# అమ్మాయిలూ.. ఆఫర్ల వలలో పడకండి.. జాగ్రత్త సీపీ సజ్జనార్



హైదరాబాద్, ఆగష్టు 8:అమ్మాయిలూ.. రెంట్ బాయ్‌ఫ్రెండ్ ఆఫర్ల వలలో పడకండి.. జాగ్రత్త అని హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సజ్జనార్ హెచ్చరించారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న రెంట్ బాయ్‌ఫ్రెండ్ ఆఫర్ల వెనుక సైబర్ మోసం ఉందని వ్యాఖ్యానించారు. ఈ మేరకు సజ్జనార్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. అమ్మాయిలు, యువతులే టార్గెట్‌గా సైబర్ కేటుగాళ్లు కొత్త డేటింగ్ పేరుతో ట్రాప్ చేస్తున్నారని పేర్కొన్నారు. ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్‌లో ఆకర్షణీయమైన పోస్టర్లతో సైబర్ క్రిమినల్స్ యువతులకు వల వేస్తున్నారని తెలిపారు. 'ఆగష్టు 1 స్పెషల్ ఆఫర్ అంటూ డిస్కౌంట్ ఆఫర్లు ప్రకటించారని చెప్పుకొచ్చారు. కాఫీ డేట్ - రూ.499, సినిమా డేట్ - రూ.1,249 అంటూ ప్యాకేజీలు ప్రకటించారని తెలిపారు. షాపింగ్, ఈవెంట్లు, పెళ్లిళ్లకు తోడుగా వస్తామంటూ వివిధ ధరలతో సైబర్ క్రిమినల్స్ ఆఫర్లు ఇచ్చారని వెల్లడించారు.

పదిగంటల ఫుల్ డే ప్యాకేజీ రూ.4,499 అంటూ సైబర్ కేటుగాళ్లు ప్రచారం చేశారని సీపీ సజ్జనార్ తెలిపారు. ఏఐతో రూపొందించిన లేదా ఇంటర్నెట్ నుంచి సేకరించిన హ్యాండ్సమ్ యువకుల ఫొటోలతో ఫేక్ ప్రొఫైల్స్ సృష్టించారని చెప్పుకొచ్చారు. ఈ మెసేజ్ చేసిన అమ్మాయిలతో తియ్యటి మాటలతో చాటింగ్ చేస్తారని.. ఆపై అసలు మోసం ఉంటుందని అన్నారు. బుకింగ్ కన్ఫర్మేషన్, సెక్యూరిటీ డిపాజిట్, అడ్వాన్స్ పేరుతో డబ్బులు వసూలు చేస్తారని చెప్పుకొచ్చారు. డిజిటల్ వాలెట్లు, క్యూఆర్ కోడ్ల ద్వారా వేలాది రూపాయలను సైబర్ కేటుగాళ్లు దోచుకుంటున్నారని వెల్లడించారు.డబ్బులు తీసుకున్న తర్వాత అకౌంట్లు బ్లాక్ చేసి సైబర్ క్రిమినల్స్ మాయం అవుతారని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. చాటింగ్ సమయంలో సేకరించిన ఫోన్ నంబర్లు, ఫొటోలతో బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడే అవకాశం ఉందని వార్నింగ్ ఇచ్చారు. అపరిచిత వ్యక్తులను నమ్మి నేరుగా కలిస్తే ట్రాప్ చేసే ప్రమాదం ఉంటుందని తెలిపారు. ఇలాంటి మోసపూరిత ప్రకటనలపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించారని వివరించారు. మోసాలకు పాల్పడుతున్న సైబర్ క్రిమినల్స్‌పై వేగంగా దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆకర్షణీయమైన ఆఫర్లను చూసి ముందస్తుగా ఒక్క రూపాయి కూడా చెల్లించొద్దని వార్నింగ్ ఇచ్చారు. అపరిచిత వ్యక్తులతో చాటింగ్, వ్యక్తిగత వివరాలు, ఫొటోలు షేర్ చేయొద్దని సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లల సోషల్ మీడియా, ఆన్‌లైన్ పరిచయాలపై అప్రమత్తంగా ఉండాలని సీపీ సజ్జనార్ సూచించారు.

# అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు.. అడవిలోకి దూసుకెళ్లిన వైనం

## తృటిలో తప్పిన పెను ప్రమాదం.. 20 మంది ప్రయాణికులు సురక్షితం





ములుగు, ఆగష్టు 8:(నేటి నిజం ప్రతినిధి) జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రం సమీపంలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద జాతీయ రహదారిపై ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు అదుపుతప్పి రహదారి పక్కనున్న అడవిలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న సుమారు 20 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడటంతో పెను ప్రమాదం తప్పింది. బస్సు అదుపుతప్పడంతో ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు.

### సాంకేతిక సమస్యతో అదుపుతప్పిన బస్సు

వరంగల్ నుంచి కాళేశ్వరం వైపు ప్రయాణికులతో వస్తున్న ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సు మహాదేవపూర్ అయ్యప్పస్వామి ఆలయం సమీపంలోని జాతీయ రహదారిపైకి చేరుకోగానే ఒక్కసారిగా సాంకేతిక సమస్య తలెత్తినట్లు సమాచారం. స్టీరింగ్, బ్రేక్ వ్యవస్థలో సమస్య ఏర్పడటంతో బస్సును అదుపులోకి తీసుకురావడం కష్టంగా మారింది. దీంతో బస్సు రహదారి నుంచి పక్కకు దూసుకెళ్లి అడవిలోకి ప్రవేశించింది.

బస్సును అదుపులోకి తీసుకువచ్చే క్రమంలో ఒక్కసారిగా అది తిరిగి వరంగల్ వైపు దిశగా ఆగిపోయింది. అదృష్టవశాత్తూ బస్సు బోల్తా పడకపోవడంతో పాటు ప్రయాణికులకు ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. దీంతో ప్రయాణికులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

### అధిక లోడుతో ఇసుక లారీల రాకపోకలు

ఇదిలా ఉండగా, ఈ జాతీయ రహదారిపై అధిక లోడుతో ఇసుక లారీలు నిరంతరం రాకపోకలు సాగించడం వల్ల రహదారి పరిస్థితి దెబ్బతింటోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వాహనాల రాకపోకల కారణంగా వాహనాల టైర్లు వెళ్లే ప్రాంతాల్లో లోతైన గాడులు, కల్వల మాదిరిగా ఏర్పడ్డాయని చెబుతున్నారు.

ముఖ్యంగా వర్షం కురుస్తున్న సమయంలో ఈ గాడుల్లో నీరు చేరడంతో రహదారి పరిస్థితి స్పష్టంగా కనిపించకపోవడంతో పాటు వాహనాల టైర్లు సరిగా తిరగక, వాహనాలు అదుపుతప్పే ప్రమాదం ఉందని వాహనదారులు పేర్కొంటున్నారు. ఇసుక లారీల అధిక లోడింగ్ కారణంగా రహదారిపై ఏర్పడుతున్న ఈ గాడులు చిన్న వాహనాలతో పాటు ఆర్టీసీ బస్సులకు కూడా ప్రమాదకరంగా మారుతున్నాయని చెబుతున్నారు.

### ప్రమాదాలు జరగకముందే చర్యలు తీసుకోవాలి

మహాదేవపూర్-కాళేశ్వరం జాతీయ రహదారిపై భారీ వాహనాల రాకపోకలను దృష్టిలో పెట్టుకుని రహదారి పరిస్థితిని అధికారులు పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. అధిక లోడుతో వెళ్తున్న ఇసుక లారీలపై చర్యలు తీసుకోవడంతో పాటు, రహదారిపై ఏర్పడిన గాడులను వెంటనే పూడ్చి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.ఇప్పటికే ఆర్టీసీ బస్సు ప్రమాదం తృటిలో తప్పిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమై రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు. మరో ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించకముందే రహదారి సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొంటున్నారు.

# తలకిందులుగా బోల్తాపడిన బస్సు.. 7 మంది మృతి, 11 మందికి గాయాలు



న్యూఢిల్లీ, ఆగష్టు 8: హిమాచల్ ప్రదేశ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. బైరాఘర్-చంబా మార్గంలో ప్రైవేటు బస్సు రోడ్డుపై స్కిడ్ అయి బోల్తా పడింది. ఈ ఘటనలో ఏడు మంది మృతిచెందారు. 11 మంది గాయపడ్డారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నది. చంబా జిల్లాలోని చురా సబ్‌డివిజన్‌లో ఈ ప్రమాదం జరిగింది. చంబా నుంచి బైరాఘర్ వెళుతున్న సమయంలో యాక్సిడెంట్ జరిగినట్లు అధికారులు తెలిపారు. చాలుంజ్ మలుపు వద్ద బస్సు అదుపు తప్పి.. కింద ఉన్న మరో రోడ్డుపై పడింది. రోడ్డుపై స్కిడ్ అయిన బస్సు.. దిగువ రోడ్డుపై బోల్తా పడింది. బస్సు కిందమీదగా పడిపోయింది. అనేక మంది ప్రయాణికులు ఆ బస్సులో ట్రాప్ అయ్యారు. రెస్క్యూ బృందాలు, స్థానిక ప్రజలు ఆ స్పాట్‌కు చేరుకున్నారు.

బస్సులో చిక్కుకున్న వారిని తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మృతులను, గాయపడ్డవారిని గుర్తించాల్సి ఉన్నది. గాయపడ్డవారిని సమీప ఆస్పత్రులకు తరలించారు. చాలా మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడడం వల్ల మృతుల సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నట్లు భావిస్తున్నారు. చురాహ్ ఎమ్మెల్యే హన్స్ రాజ్ ఈ ఘటన పట్లగ్రాభ్రంతి వ్యక్తం చేశారు. యాక్సిడెంట్ చాలా బాధాకరంగా ఉన్నట్లు చెప్పారు. మృతి చెందిన కుటుంబాలకు ఆయన సంతాపం తెలిపారు.

చురాహ్‌లోని పర్వత ప్రాంతాలపై ఉన్న రోడ్లు అత్యంత ప్రమాదకరంగా ఉంటాయి. అక్కడ మలుపులు, స్లోప్స్ వల్ల రోడ్డు ప్రమాణం ఇబ్బందిగా మారుతోంది. ఈ ఏడాది మే నెలలో కూడా ఇక్కడ

# యూఏఈ బతుకమ్మ వేడుకలకు కేటీఆర్‌కు ఆహ్వానం

హైదరాబాద్, ఆగష్టు 8: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో నిర్వహించనున్న బతుకమ్మ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఈటీసీఏ?యూఏఈ) ప్రతినిధులు ఆహ్వానించారు. శుక్రవారం నంది నగర్‌లోని కేటీఆర్ నివాసంలో ఆయనను కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. అనంతరం బతుకమ్మ వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను కేటీఆర్ చేతుల మీదుగా విడుదల చేశారు.

ఈటీసీఏ ఆధ్వర్యంలో గత 16 ఏళ్లుగా యూఏఈలో బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తున్నామని ప్రతినిధులు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా బతుకమ్మతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈసారి అక్టోబర్ 11న దుబాయ్‌లోని అల్ అహిలి స్పోర్ట్స్ క్లబ్‌లో బతుకమ్మ సంబరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

# ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని కార్మిక సంఘాల హెచ్చరిక

## వేతన ఒప్పందం అమలులో జాప్యాన్ని నిరసిస్తూ కార్మిక సంఘాల జేఏసీ ఆందోళన





కరీంనగర్, ఆగష్టు 8: సింగరేణి బొగ్గు గని కార్మికుల 12వ వేజ్ బోర్డు ఒప్పందం అమలులో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ ఈ నెల 10న సింగరేణి వ్యాప్తంగా పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహించనున్నట్లు కార్మిక సంఘాల జేఏసీ నేతలు ప్రకటించారు. కోల్‌బెల్ట్ పరిధిలోని అన్ని జనరల్ మేనేజర్ కార్యాలయాలతో పాటు సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి మాట్లాడారు.

వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ.. 12వ వేజ్ బోర్డు ఒప్పందాన్ని జూలై 1 నుంచి అమలు చేయాల్సి ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఆరోపించారు. నాలుగు లేబర్ కోడ్‌ల విధానాన్ని ముందుకు తీసుకురావడం ద్వారా వేతన ఒప్పందం అమలును ఆలస్యం చేస్తున్నారని విమర్శించారు.

కోల్ ఇండియాలో గుర్తింపు ఎన్నికలు పూర్తయిన తర్వాతే వేతన ఒప్పందాన్ని అమలు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ ఆలోచన సరైనది కాదని ఆయన అన్నారు. గుర్తింపు ఎన్నికల్లో 51 శాతం మద్దతు ఉన్న సంఘంతోనే నిర్ణయాలు తీసుకోవాలన్న నిబంధనను కూడా వ్యతిరేకించారు. కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని 12వ వేజ్ బోర్డు ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

12వ వేజ్ బోర్డు అమలులో జాప్యాన్ని నిరసిస్తూ ఈ నెల 10న సింగరేణి వ్యాప్తంగా అన్ని జీఎం కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహిస్తామని వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. వేతన ఒప్పందం అమలు చేయకపోతే భవిష్యత్తులో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో పోరాటాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ నెల 10న నిర్వహించే ధర్నాల్లో సింగరేణి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కులు, వేతన ప్రయోజనాలకు భంగం కలిగించే విధానాలను తాము వ్యతిరేకిస్తామని, 12వ వేజ్ బోర్డు అమలు కోసం సింగరేణి వ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని రాజిరెడ్డి పేర్కొన్నారు.

సమావేశంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, నాయకులు గౌతం గోవర్ధన్, దాసరి శ్రీనివాస్, బిట్టి వెంకటేశ్వర్లు, ఏవీఎస్ ప్రకాశ్, రాజేశ్వర్‌రావు, దేవయ్య, కార్యాలయ కార్యదర్శి తొడుపునూరి రమేశ్‌కుమార్, సీఐటీయూ నాయకులు శివరాంరెడ్డి, రాజమౌళి, నరహరిరావు, ప్రవీణ్, ఐఎన్‌టీయూసీ నాయకులు వెంకటేశ్వర్లు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్ది కుటుంబానికి పెద్దదిక్కుగా కేసీఆర్

-పార్టీ తరఫున రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం..
-పిల్లల భవిష్యత్తుకు అండగా ఉంటామని భరోసా



హైదరాబాద్, ఆగష్టు 8:ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన దివంగత నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అండగా నిలిచారు. పార్టీ తరఫున ఆ కుటుంబానికి మొత్తం రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు.

పెద్ది సుదర్శన్‌రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి చొప్పున ఆర్థిక సహాయం అందించాలని కేసీఆర్ నిర్ణయించారు. వృద్ధాప్యంలో ఉన్న ఆయన తల్లి అమృతమ్మ బాగోగుల కోసం మరో రూ.25 లక్షలు ఆమె పేరుతో బ్యాంకులో జమ చేయాలని నిర్ణయించారు. దీంతో మొత్తం రూ.2.25 కోట్లను పెద్ది కుటుంబానికి పార్టీ తరఫున అందించనున్నారు.

చదువుకు, భవిష్యత్తుకు అండగా..

పిల్లల భవిష్యత్తు, వారి చదువు, కుటుంబ సంక్షేమానికి సంబంధించి పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తూ అండగా ఉంటుందని కేసీఆర్ భరోసా ఇచ్చారు. పార్టీ సీనియర్లు, వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో చర్చించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.

పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ కార్యక్రమాలు పూర్తయిన తర్వాత జిల్లా పార్టీ ముఖ్య నేతలు సమావేశమై కుటుంబ సంక్షేమానికి సంబంధించి తదుపరి చర్యలు నిర్ణయిస్తారని కేసీఆర్ తెలిపారు. పెద్ది కుటుంబానికి ఎల్లకాలం పార్టీ అండగా ఉంటుందని పునరుద్ఘాటించారు.




# పుస్తకం మస్తిష్క వికాస కేంద్రం

## (09 ఆగష్టు "జాతీయ పుస్తక ప్రియుల దినోత్సవం" సందర్భంగా)

పుస్తకం విజ్ఞాన భాండాగారం. పుస్తకం హస్తభూషనమే కాదు మస్తిష్క వికాస సాధనం. సరస్వతి కొలువైన దేవాలయం గ్రంధాలయమే. విజ్ఞాన సమపార్జనకు మూల సూత్రం పుస్తక పఠనం. జ్ఞాన వితరణ మాధ్యమం పుస్తకమే. పుస్తకాన్ని నమ్మిన వాడు మహాజ్ఞాని అవుతాడు. పుస్తకాన్ని, గ్రంధాలయాన్ని వ్యతిరేకించిన వాడు అపర అజ్ఞాని. ఒక పుస్తకం వేల మెదళ్లను వెలిగించే జ్ఞానదీపం.

పుస్తకాలు కొలువుదీరి సరస్వతీ నిలయాలు గ్రంథాలయం మాత్రమే. గ్రంధాలయ దర్శనంతో మనో విస్తృతి విస్తరిస్తుంది. పుస్తక పఠన ప్రాధాన్యాన్ని గుర్తించిన ప్రతి ఏట 09 ఆగష్టు రోజున ప్రపంచవ్యాప్తంగా "జాతీయ పుస్తక ప్రియుల దినోత్సవం (నేషనల్ బుక్ లవర్స్ డే)"ను నిర్వహించుట ఆనవాయితీగా మారింది. జాతీయ పుస్తక ప్రియుల దినోత్సవం-2026ను వేదికగా చేసుకొని పుస్తక పఠన ఆవశ్యకతను తెలియజేస్తూ, ఆ మార్గంలో తనదైన రీతిలో చదవాలని ప్రచారం నిర్వహించడం జరుగుతుంది.

### లుక్ కల్చర్ వద్దు బుక్ కల్చరే ముద్దు:

డిజిటల్ అంతర్జాల వలలో విశ్వమే కుగ్రామం అయ్యింది. అరచేతిలో స్మార్ట్ వైకుంఠం తిష్ట వేసింది. గూగులమ్మ ఒడిలో పుస్తకాలు దాక్కుంటున్నాయి. బుక్ కల్చర్ మాయమై లుక్ కల్చర్ ప్రత్యక్షం అవుతున్నది. గ్రంధాలయాలు అనాధలు అయిపోతున్నాయి. పుస్తకాలు నిరాదరణతో చిన్నబోతున్నాయి. చందమామ కథలు, బాలమిత్ర చతురతలు అంతరించాయి. బొమ్మ ఒడికి దూరమై గూగులమ్మ పంచన చేరుతున్నారు యువత. పిల్లలతో పాటు పెద్దలు సహితం పుస్తకపఠనాన్ని త్యాగం చేసి చరవాణి/ల్యాప్‌టాప్/ట్యాబ్‌లతో స్నేహం చేస్తున్న విచిత్ర ఏఐ యుగం నడుస్తున్నది. విశ్వ మానవాళిని పుస్చక పఠనం వైపు ఆకర్షించడానికి, గ్రంధాలయాల ప్రాధాన్యాలను ఏకరువు పెట్టడానికి జాతీయ పుస్తక ప్రియుల దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించడం సముచితంగా ఉన్నది. ఈ దినోత్సవంలో భాగంగా పుస్తక ప్రియులను సన్మానించడం, పుస్తక పఠన ప్రయోజనాలు, రచయితలను గుర్తించడం, పుస్తక పఠనాన్ని నమ్మి ఉన్నత స్థితులకు ఎదిగిన మేధావులను సన్మానించుకోవడం, పుస్తక పఠనమే ప్రధాన అంశంగా విద్యాలయాల్లో పోటీలను నిర్వహించడం, పుస్తకాల విక్రయశాలల సందర్శన, పుస్తక ప్రదర్శనల నిర్వహణ, పుస్తకాలు కొని వ్యక్తిగత లైబ్రరీలను నెలకొల్పడం, పిల్లలచేత నీతి కథల పుస్తకాలను చదివించడం, పఠనాసక్తి కలిగిన యువతకు ప్రోత్సాహకాలు బహిష్కరించడం లాంటి పలు కార్యక్రమాలను ఈ దినోత్సవ వేదికగా నిర్వహించవచ్చు.

### పుస్తక పఠన ప్రయోజనాలు:

ఒకసారి పుస్తక పఠన సాగర ఈతను ప్రారంభిస్తే, విషయ పరిజ్ఞాన తీరాలకు చేరుతూ విజేతలుగా నిలవడానికి ప్రయత్నించాలి. పాఠ్యాంశాలతో పాటు జనరల్ నాలెడ్జ్ పెంచగల ఇతర పుస్తకాలు, మ్యాగజీన్సు, పత్రికలు నిత్యం చదవడం అలవాటు చేసుకోవాలి. పుస్తకాన్ని చదివిన వారిని జ్ఞాన సరస్వతి దీవిస్తూ, ఉజ్వల భవిష్యత్తు, సమాజ గుర్తింపులను అందజేస్తుంది. పుస్క పఠన అభిరుచితో ఓపిక, జ్ఞాన సంపన్నత, ఏకాగ్రత, విద్యావంతులుగా ఎదగడం, మేధో వికాసం ఫలించడం సహజంగానే జరుగుతుంది. పుస్తక పఠనం మెదడుకు వ్యాయామంగా పని చేసి చురుకుగా మార్చుతుంది. పుస్తక ఫలవంతమైన ఓ ఉత్సవంగా వర్ధిల్లుతుంది. పఠనం భారం కాదు, పరమానంద భరితం. పుస్తకాలను ప్రేమించిన వారిని ప్రపంచం అక్కున చేర్చుకుంటుంది. పుసేతక పఠనాన్ని బాల్యం నుంచే అలవాటు చేయాలని తల్లితండ్రులు, ఉపాధ్యాయులు గుర్తించాలి. కత్తిని పదును చేయడానికి ఆకురాయి కావాలి.

మెదడు చురుకుదనం పెంచడానికి పుస్తక పఠనం తోడవ్వాలి. పుస్తక పఠనంతో విషయ పరిజ్ఞానం, పారిభాషిక పదకోశం, ఆత్మవిశ్వాసం, లోకజ్ఞానం, శాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్య వికాసనం, జనరల్ నాలెడ్జ్, ఆకర్షనీయ వేతనం, సమాజంలో ఉన్నత స్థానం, కుటుంబ సంక్షేమం, వ్యక్తిత్వ అభివృద్ధి, పేరు ప్రఖ్యాతులు అప్రయత్నంగా, సులభంగా పెరుగుతాయి.

నేటి ఆధునిక యువత గ్రంధాలయ దర్శనం చేస్తూ పుస్తకాల పఠన ప్రపంచంలో మునిగి, జ్ఞాన సాగరం ఈది, ఎవరెస్టు శిఖరమంత ఎదిగి, రేపటి విజ్ఞాన వివేకవంతుల సమాజ స్థాపనకు బాటలు వేసి భవిష్యత్తుకు బాధ్యత కలిగిన విజ్ఞానవంతులను దేశానికి అందజేద్దాం, పుస్తకాన్ని నిత్య నేస్తంగా అక్కున చేర్చుకుందాం.



-మధుపాలీ
9949700037

# చేనేత రంగ సుస్థిరాభివృద్ధికి నూతన సాంకేతికతలను ఉపయోగించుకోవాలి: రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపదీ ముర్ము

న్యూఢిల్లీ, ఆగష్టు 8:ఈ రోజు, అంటే 2026 ఆగస్టు 8న పన్నెండో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపదీ ముర్ము పాల్గొన్నారు. సంత్ కబీర్ చేనేత పురస్కారాలను, 2025 సంవత్సరానికిగాను జాతీయ చేనేత పురస్కారాలను రాష్ట్రపతి ప్రదానం చేశారు. భారత సుసంపన్న, వైవిధ్యపూరిత చేనేత సంప్రదాయాలకు గుర్తుగా నాలుగు తపాలా బిళ్లలను కూడా ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

సభను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగిస్తూ... శతాబ్దాల తరబడి భారత నాగరికత అభివృద్ధి ప్రస్థానంలో చేనేత ఓ అంతర్భాగంగా ఉందనీ, ఇది మన దేశానికున్న అసాధారణ వైవిధ్యాన్ని చాటుతూ, ప్రాంతీయ విశిష్టతను పరిరక్షిస్తోందని శ్రీమతి ద్రౌపదీ ముర్ము అన్నారు. ఉపాధిని, మహిళా సాధికారత కల్పనను, కళలను, సంస్కృతిని, ప్రకృతి పట్ల ప్రేమను చేనేత రంగం పెంపొందింపచేస్తోందని రాష్ట్రపతి వివరించారు. భారత స్వాతంత్ర్య పోరాటంతో, స్వావలంబన భావనతో కూడా చేనేత జతపడి ఉందన్నారు.

స్వదేశీ ఉద్యమాన్ని 1905 ఆగస్టు 7న లాంఛనంగా ప్రారంభించారని రాష్ట్రపతి అన్నారు. బెంగాల్ విభజనను వ్యతిరేకిస్తూ మొదలుపెట్టిన ఈ ఉద్యమ లక్ష్యం స్వదేశీ వస్తువులు, దేశీయ పరిశ్రమలతో పాటు మరీ ముఖ్యంగా దేశ చేనేత కార్మికులను ప్రోత్సహించడమని వివరించారు. ఈ చరిత్రాత్మక ఘటనను గౌరవించుకుంటూ, కేంద్ర ప్రభుత్వం 2015 నుంచి ఆగస్టు 7ను జాతీయ చేనేత దినోత్సవంగా నిర్వహిస్తోందన్నారు. చేనేత రంగంలో అనుబంధం కలిగి ఉన్న ప్రతి ఒక్కరికీ జాతీయ చేనేత దినోత్సవ సందర్భంగా రాష్ట్రపతి అభినందనలు తెలిపారు. భారత చేనేత రంగానికి అధిక నాణ్యతతో కూడిన ప్రతిష్ఠను అందించే దిశగా ప్రభుత్వం, చేనేత సమాజం కలిసికట్టుగా చేస్తున్న ప్రయత్నాలను గుర్తించాల్సిన సందర్భమని రాష్ట్రపతి అన్నారు.

భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక, మానవ శ్రమ ప్రధాన ఉదాహరణగా మారే సామర్థ్యాన్ని మన చేనేత రంగం రోజు రోజుకూ పెంచుకొందని రాష్ట్రపతి అన్నారు. కీలక చేనేత క్లస్టర్లను ఆధునిక సాంకేతికతతో, సమకాలీన శిక్షణ పద్ధతులతో అనుసంధానిస్తున్నారన్నారు. కళాకారుల ఆదాయాన్ని పెంపొందించే దిశగా ప్రభుత్వం అనేక చర్యలను తీసుకుంటోందని రాష్ట్రపతి అన్నారు. ఈ రంగాన్ని ప్రామాణిక సాంస్కృతిక ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో భారత చేనేత రంగానికి అంతర్జాతీయంగా పేరు ప్రతిష్టలు వస్తున్నాయని శ్రీమతి ద్రౌపదీ ముర్ము తెలిపారు.

అనేక మంది యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సాంకేతిక, వినూత్న డిజైన్లతో ఈ రంగంలోకి అడుగుపెడుతున్నారని రాష్ట్రపతి తెలిపారు. ప్రభుత్వ పథకాలు, సంస్థలు యువతకు వెన్నుదన్నుగా నిలవాలనీ, అప్పుడు వారి ఉత్సాహం, నైపుణ్యాలు ఈ రంగానికి దీర్ఘకాలిక, బహుళ విజయాలను అందించగలుగుతాయని శ్రీమతి ద్రౌపదీ ముర్ము అన్నారు. యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, డిజైనర్లు, అంకుర సంస్థలు సాంప్రదాయిక హస్తకళలను ఆధునిక ధోరణులు, బ్రాండ్లు, గ్లోబల్ వేల్యూచైన్లతో అనుసంధానించి ఈ రంగంలో కొత్త కొత్త అవకాశాల్ని సృష్టించడానికి అవకాశం ఉందని రాష్ట్రపతి చెప్పారు. యువత ఈ రంగంలో పనిచేయడానికి ముందుకు వచ్చేలా ఇండియన్ ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ ఆధ్వర్యంలోని డిజైన్ రిసోర్స్ సెంటర్లతో పాటు వీవర్స్ సర్వీస్ సెంటర్లు గణనీయమైన కృషిని చేస్తున్నట్లు తెలుసుకొన్నట్లు రాష్ట్రపతి తెలిపారు.

చేనేత రంగం దీర్ఘకాలం పాటు అభివృద్ధి పథంలో పయనించాలంటే కొత్త సాంకేతికతలను సరైన పద్ధతిలో ఉపయోగించుకోవడం ఎంతైనా అవసరమని రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపదీ ముర్ము అన్నారు. ఆధునిక డిజిటల్ సేవలను తో మరిన్ని ఎక్కువ మార్కెట్లకు చేరుకోవడం సాధ్యపడుతుందని చెప్పారు. దీనికి తోడు, ఈ-కామర్స్ వేదికలను వినియోగించుకొని భారతీయ చేనేత ఉత్పాదనలను అంతర్జాతీయ మార్కెట్లకు చేర్చడాన్ని గణనీయ స్థాయిలో పటిష్ఠపరచవచ్చన్నారు. దేశ సమ్మిళిత అభివృద్ధికి, స్వావలంబనకు చేనేత రంగం బలమైన పునాదిగా మారగలదన్న విశ్వాసాన్ని రాష్ట్రపతి వ్యక్తం చేశారు.

నేత కళాకారుల అంకితభావాన్నీ, భారత చేనేత సంప్రదాయాల పరిరక్షణ, దిశగా అందించే దేశ అత్యున్నత పురస్కారమే సంత్ కబీర్ చేనేత పురస్కారం. సాంప్రదాయిక నైపుణ్యాలను సంరక్షిస్తూ, ఆధునిక సాంకేతికతలను అనుసరిస్తూ అసాధారణ సృజనాత్మకత, నాణ్యత, నూతన ఆవిష్కరణలు, ప్రావీణ్యాన్ని కనబరిచే చేనేత కార్మికులకు, ఇతర ఆసక్తిదారులకు జాతీయ చేనేత పురస్కారాలను ప్రదానం చేసి, వారిని సత్కరిస్తున్నారు.

# దుబాయి మృతిని కుటుంబీకులను పరామర్శించిన ఎమ్మెల్యే..

ఆదిలాబాద్, ఆగష్టు 8:మండలంలోని చింతగూడ గ్రామ సమీపంలో ఉన్న శ్రీ లక్ష్మీదేవి ఆలయంలో శుక్రవారం ఎమ్మెల్యే బొజ్జు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు రేండ్లగూడ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ దంపతుల కుమారుడి నామకరణ మహోత్సవానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారిని ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమంలో జన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు లక్ష్మీనారాయణ, ఫసిహుల్లా, పార్టీ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అజ్మీర నందునాయక్, మాణిక్యం, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం మోహన్‌రెడ్డి, నాయకులు మచ్చ శంకరయ్య, దాముక కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తిస్తా

ఆదిలాబాద్, ఆగష్టు 8: తెలంగాణ ఉద్యమకారుల సమితి (టీయూఎస్) మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా రామకృష్ణాపూర్‌కు చెందిన రామిడి కుమార్‌ను నియమించారు. ఈ మేరకు టీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తొడేటి శంకర్‌గౌడ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ ఉద్యమంలో రామిడి కుమార్ అందించిన సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# హుజూర్‌నగర్ పీఆర్టీయూ మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**-అధ్యక్షుడిగా గొట్టే శ్రీనివాస్.. ప్రధాన కార్యదర్శిగా నిమ్మనగంటి నరసయ్య**

**-నూతన కమిటీకి అభినందనలు తెలిపిన జిల్లా నాయకత్వం**

ఆదిలాబాద్, ఆగష్టు 8: హుజూర్‌నగర్ మండల పీఆర్టీయూ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గొట్టే శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా నిమ్మనగంటి నరసయ్య, అసోసియేట్ అధ్యక్షుడిగా కొప్పుల బ్రహ్మారెడ్డి, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా ఎం. షర్మిలకుమారి ఎన్నికయ్యారు.

ఉపాధ్యక్షులుగా సిరికొండ వెంకటయ్య, మహిళా ఉపాధ్యక్షురాలిగా ఎస్. వీరమ్మ, కార్యదర్శులుగా జెల్లా సత్యనారాయణ, కీత శ్రీనివాస్, ఎం.డి. నజీమా అంజుమ్, చడపంగు జయమ్మ ఎన్నికైనట్లు పీఆర్టీయూ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు తంగెళ్ల జితేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తీగల సురేష్ తెలిపారు.

నూతనంగా ఎన్నికైన పీఆర్టీయూ హుజూర్‌నగర్ మండల కమిటీ సభ్యులకు జిల్లా నాయకులు అభినందనలు తెలిపారు. రెండేళ్ల పదవీకాలంలో చక్కటి పనితీరు కనబరిచి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ సంఘానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పీఆర్టీయూ సంఘాన్ని మరింత ఉన్నత స్థితికి తీసుకెళ్లేలా సమష్టిగా పనిచేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

**-అధికారులు సమన్వయంతో పనిచేయాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్**




రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 8:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల్లో మరింత వేగం పెంచాలని సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. ప్రతి పనికి గడువు విధించి నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.

వేములవాడ ఆలయ ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ పనులపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం దేవాదాయ, మున్సిపల్, ఆర్అండ్‌బీ, ఎన్పీడీసీఎల్, నీటిపారుదల శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ రాజరాజేశ్వర దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులను అధికారులు సమన్వయంతో చేపట్టాలని సూచించారు. కార్మికుల సంఖ్యను పెంచి పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు.

రాజరాజేశ్వర ఆలయ నూతన గోశాల పనుల పురోగతిని అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. గుడి చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. మరుగుదొడ్ల నిర్మాణం, నిర్వహణకు సంబంధించి పర్యాటక, వేములవాడ మున్సిపల్ శాఖ అధికారులకు సూచనలు చేశారు.

బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ పనులను ప్రణాళిక ప్రకారం వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రధాన ఆలయం నుంచి తిప్పాపూర్ బ్రిడ్జి వరకు చేపడుతున్న 80 అడుగుల రహదారి విస్తరణ పనుల పురోగతిని సమీక్షించారు.

రహదారి నిర్మాణంతో పాటు ఇరువైపులా మురుగు కాలువల నిర్మాణ తుది దశ పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. విద్యుత్ టవర్ల నిర్మాణ పనులను కూడా త్వరితగతిన ప్రారంభించాలని ఆదేశించారు.

జిల్లా వైద్య కళాశాల, బాలుర, బాలికల వసతి గృహాల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు అందు బాటులోకి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. సిరిసిల్లలో కోర్టు సముదాయ పనులను కూడా నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.సమావేశంలో ఆర్అండబీ ఈఈ భీమ్లానాయక్, ఆలయ ఈఈ రాజేష్, ఎన్పీడీసీఎల్ ఈఈ వేణుమాధవ్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ సేవ
ఆహ్వానం
చిమ్మపూడి ఫౌండేషన్
హైదరాబాదు
శ్రీ కృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం
సంయుక్త ఆధ్వర్యంలో
కథా సౌదామిని
(కథా రచయిత్రుల సమ్మేళనం)
తేది : 16-08-2026 ఆదివారం సా॥ 05-30 గం॥లకు
వేదిక : శ్రీ కృష్ణ దేవరాయ తెలుగు భాషానిలయం, హైదరాబాదు.
ముఖ్య అతిథి & సన్మానకర్త :
డా॥ కె.వి. రమణ గారు, (ఐ.ఏ.ఎస్. రిటైర్డ్)
తెలంగాణ రాష్ట్ర పూర్వ సలహాదారు, చిమ్మపూడి ఫౌండేషన్ గౌరవ సలహాదారు
సభాధ్యక్షులు : డా॥ కొండపల్లి నీహారిణి గారు,
గౌరవ అతిథులు : శ్రీమతి అయినంపూడి శ్రీలక్ష్మి గారు,
శ్రీమతి పొత్తూరి జయలక్ష్మి గారు,
సభా సమన్వయకర్త : శ్రీ చిమ్మపూడి శ్రీరామమూర్తి గారు,
అధ్యక్షులు, చిమ్మపూడి ఫౌండేషన్
కథా కథనంలో పాల్గొంటున్న రచయిత్రులు :
శ్రీమతి వారణాసి నాగలక్ష్మి గారు, శ్రీమతి గరిమెళ్ల సుబ్బలక్ష్మి గారు,
శ్రీమతి ఆకెళ్ల వెంకటసుబ్బలక్ష్మి గారు, డా॥ దేవులపల్లి వాణీదేవి గారు,
శ్రీమతి గంటి భానుమతి గారు, శ్రీమతి యలమర్తి అనూరాధ గారు,
శ్రీమతి ధూళిపాళ అరుణ గారు, శ్రీమతి జ్వలిత గారు,
శ్రీమతి గంటి ఉషాబాల గారు, శ్రీమతి శైలజామిత్ర గారు,
వ్యాఖ్యానం : శ్రీమతి పి.వి.ఎల్. సుజాత గారు
వందన సమర్పణ : శ్రీ చిమ్మపూడి రవికుమార్ గారు,
ఉపాధ్యక్షులు, చిమ్మపూడి ఫౌండేషన్
ఉడయవర్లు, కార్యదర్శి
శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషానిలయం
మీ ఆగమనాభిలాషులు
చిమ్మపూడి ఫౌండేషన్ కార్యవర్గం

# మహారాష్ట్రలోని సతారా జిల్లాలో అక్రమ మత్తు పదార్థాల తయారీ కేంద్రం గుట్టురట్టు చేసిన డీఆర్ఐ.. ఇద్దరు అరెస్టు





న్యూఢిల్లీ, ఆగష్టు 8:మహారాష్ట్ర... సతారా జిల్లాలో రహస్యంగా నడుపుతున్న ఓ మాదక ద్రవ్యాల తయారీ కేంద్రంపై డీఆర్ఐ అధికారులు దాడులు చేశారు. ఈ ఆపరేషన్‌లో వివిధ రూపాల్లో ఉన్న సైకోట్రాపిక్ పదార్థాలతోపాటు వాటి తయారీకి ఉపయోగించే సుమారు 400 లీటర్ల ముడి సరుకును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ఇద్దరిని అరెస్టు చేశారు.

పక్కా సమాచారంతో 2026 ఆగస్టు 01న సతారా జిల్లాలోని తయారీ కేంద్రంపై డీఆర్ఐ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ఎన్‌డీపీఎస్ చట్టం 1985 ప్రకారం నిషేధిత అల్ప్రజోలం, డైజిపామ్ ను ఇక్కడ రహస్యంగా తయారు చేస్తూ అక్రమంగా తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దాడుల సమయంలో తయారీదారుడిని అక్కడికక్కడే అదుపులోకి తీసుకున్నారు.

అధికారుల తనిఖీల్లో సుమారు కిలో పూర్తిగా తయారైన అల్ప్రజోలం, 15 కిలోలకు పైగా సగం తయారైన రూపంలో ఉన్న అల్ప్రజోలం, సుమారు 3.75 కిలోల డైజిపామ్ ను స్వాధీనం చేసుకున్నారు. వీటి తయారీకి ఉపయోగించే సుమారు 400 లీటర్ల వివిధ రకాల ముడి పదార్థాలు, రసాయన మిశ్రమాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ సరుకంతటినీ ఎన్‌డీపీఎస్ చట్టం 1985 నిబంధనల కింద జప్తు చేశారు.

మత్తు పదార్థాలను కొనుగోలుకు సిద్ధమైన ఓ వ్యక్తిని పూణేలో అదుపులోకి తీసుకున్నారు. నిందితుల అక్రమ లావాదేవీలకు సంబంధించిన కీలక ఆధారాలను అధికారులు సేకరించారు.

అల్ప్రజోలం, డైజిపామ్ లు బెంజోడయాజెపైన్ వర్గానికి చెందినవి. ఆందోళన, పానిక్ అటాక్, నిద్రలేమి, మూర్ఛ, ఇతర నాడీ సంబంధిత సమస్యల చికిత్సకు వైద్యుల పర్యవేక్షణలో వీటిని ఉపయోగిస్తారు.

# 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం



కరీంనగర్, ఆగష్టు 8:పేద ప్రజలకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి నిల్వ ఉంచిన వ్యక్తిని కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి సుమారు 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దుబ్బపల్లి గ్రామంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన శిరిగిరి సాగర్ తండ్రి లక్ష్మరాజం తన ఇంట్లో ప్లాస్టిక్ సంచుల్లో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించారు.

పోలీసులు చేరుకోగానే పరారయ్యేందుకు ప్రయత్నించిన సాగర్‌ను వెంటనే అదుపులోకి తీసుకున్నారు. విచారణలో కొంతకాలంగా గ్రామాలు, పరిసర ప్రాంతాల్లో పేదల నుంచి తక్కువ ధరకు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఇంటి వద్ద నిల్వ ఉంచుతున్నట్లు వెల్లడైనట్లు సీఐ తెలిపారు.

అనంతరం సమీపంలోని ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల కూలీలు, పౌల్ట్రీ ఫారాలకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు.

నిందితుడి ఇంట్లో తనిఖీలు నిర్వహించగా సుమారు 37 సంచుల్లో 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లభించింది. పంచాయతీదారుల సమక్షంలో బియ్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

# ఉపాధి నిధుల కేటాయింపులో వివక్ష తగదు

## -బీజేపీ నేతల ఆందోళన.. ఆర్డీవో, ఎంపీడీవో కార్యాలయాల ముట్టడి
## -ఆర్డీవో కార్యాలయంలోకి దూసుకెళ్లిన పార్టీ శ్రేణులు..
## -పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన ఉద్రిక్తత
## -అన్ని గ్రామాలు, వార్డులకు సమానంగా నిధులు కేటాయించాలి: గంగిడి మనోహర్‌రెడ్డి




నల్గొండ, ఆగస్టు 8: కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల కేటాయింపులో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక అధికారులు తీవ్ర వివక్ష చూపుతున్నారని బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. చౌటుప్పల్ మండలం, పురపాలక సంఘం, సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలోని బీజేపీ శ్రేణులు, కౌన్సిలర్లు, సర్పంచులతో కలిసి ర్యాలీగా తరలి వెళ్లి చౌటుప్పల్ ఆర్డీవో, ఎంపీడీవో కార్యాలయాల ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గంగిడి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఒత్తిళ్లకు తలొగ్గి ఆర్డీవో వెల్మ శేఖర్ రెడ్డి, ఎంపీడీవో కే శ్రీలత ఏకపక్షంగా, పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఉన్న గ్రామాలకే ప్రాధాన్యత ఇస్తూ, బీజేపీ, బీఆర్ఎస్ సర్పంచులు, కౌన్సిలర్లు ఉన్న గ్రామాలపై నిధుల కేటాయింపులో వివక్ష చూపడం దారుణమన్నారు. ప్రజల సంక్షేమం కోసం కేంద్రం పంపే నిధులను రాజకీయ ప్రయోజనాల కోసం మళ్లించడం సరికాదని, రాజకీయాలకు అతీతంగా ప్రతి గ్రామానికి, వార్డుకు సమానంగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

### ఉద్రిక్తత.. పోలీసుల జోక్యం

ముట్టడి సందర్భంగా బీజేపీ శ్రేణులు ఒక్కసారిగా ఆర్డీవో కార్యాలయంలోని క్యాబిన్ లోపలకు దూసుకెళ్లారు. నిధుల కేటాయింపులో తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపిస్తూ ఆందోళనకు దిగడంతో తీవ్ర గందరగోళం, ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వెంటనే పోలీసులు రంగ ప్రవేశం చేసి, పలువురు బీజేపీ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారికి నచ్చజెప్పి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

### అన్ని గ్రామాలకూ సమన్యాయం చేస్తాం : అధికారులు:

పోలీసుల మధ్యవర్తిత్వంతో అధికారులతో జరిగిన చర్చల అనంతరం ఆర్డీవో స్పందిస్తూ నిధుల కేటాయింపులో ఎలాంటి పక్షపాతం ఉండదని, అన్ని గ్రామ పంచాయతీలకు, వార్డులకు సమన్యాయం జరిగేలా చూస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. అధికారుల హామీతో బీజేపీ నాయకులు నిరసనను విరమించారు. ?ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కానం వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి, రాష్ట్ర నాయకులు దోనూరు వీరారెడ్డి దూదేల బిక్షం గౌడ్, రమణగోని శంకర్, గుజ్జుల సురేందర్ రెడ్డి, శాగా చంద్రశేఖర్ రెడ్డి, కైరంకొండ అశోక్, కదారి కల్పన ఐలయ్య యాదవ్, దేవేందర్ యాదవ్, బిజెపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బుడ్డా సురేష్, కౌన్సిలర్లు ఆలే శ్రీలత చిరంజీవి, పోలేపల్లి లక్ష్మి ముత్తయ్య, సర్పంచులు తంగెళ్ల వెంకటేశం, కైరంకొండ స్వప్న అశోక్, టేకుల మంజులా రెడ్డి, నందగిరి వెంకటేష్, బోయ మహేంద్ర మనీ శరత్ కుమార్, సుర్వి సౌజన్య రాజు, ఉప్పల రమేష్, ఫకీరు శ్రీనివాస్ రెడ్డి, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, యాస అశోక్ రెడ్డి తో పాటు రెండు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 13వ బ్రిక్స్ విద్యా మంత్రుల డిక్లరేషన్‌ను ఆమోదించడంతో భువనేశ్వర్‌లో ముగిసిన సమావేశం

న్యూ ఢిల్లీ, ఆగష్టు 8:ప్రజా కేంద్రీకృత, మానవత్వమే ప్రథమ ప్రాధాన్యత కలిగిన బ్రిక్స్ సహకారానికి భారతదేశం కట్టుబడి ఉందని కేంద్ర విద్యా శాఖ మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి పునరుద్ఘాటించారు. ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరిగిన 13వ బ్రిక్స్ విద్యా మంత్రుల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. 13వ బ్రిక్స్ విద్యా మంత్రుల డిక్లరేషన్‌ను ఆమోదించడంతో ఈ సమావేశం ముగిసింది.

బ్రిక్స్ భాగస్వామ్య దేశాలన్నింటితో కలిసి పనిచేయడానికి భారత్ కట్టుబడి ఉందని మరోసారి తెలియజేసిన కేంద్ర మంత్రి.. ఈ సమావేశం ద్వారా లభించిన ప్రోత్సాహం అర్థవంతమైన ఫలితాలకు దారితీస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'దృఢత్వం, నూతన ఆవిష్కరణలు, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం' అనే భారతదేశపు 2026 బ్రిక్స్ అధ్యక్షత ఇతివృత్తాన్ని ప్రస్తావిస్తూ.. మానవ విలువలకు కట్టుబడి ఉంటూనే విద్యా వ్యవస్థలు యువతను వర్ధమాన అవకాశాలకు అనుగుణంగా సిద్ధం చేయాలని మంత్రి తెలిపారు. విధాన రూపకల్పన, అంతర్జాతీయ సహకారంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పరిశోధకులు, యువత కేంద్ర బిందువుగా ఉండాలని ఆయన పేర్కొన్నారు.

సమ్మిళిత వృద్ధి, ఉమ్మడి శ్రేయస్సుకు విద్యే ఆధారమని శ్రీ ప్రహ్లాద్ జోషి అన్నారు. ఆమోదించిన ఈ డిక్లరేషన్ ఐదు ప్రాధాన్యత రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేయడానికి బ్రిక్స్ దేశాల ఉమ్మడి నిబద్ధతను తెలియజేస్తుందని ఆయన పేర్కొన్నారు. సంప్రదాయ, స్వదేశీ పరిజ్ఞాన వ్యవస్థలను పరిరక్షించడం, ప్రోత్సహించటానికి ఉన్న ప్రాముఖ్యతను ఆయన ప్రధానంగా చెప్పారు. వినూత్న ఆలోచనలు, సాంస్కృతిక వారసత్వం ఒకదానికొకటి ప్రోత్సాహకంగా ఉంటాయని అన్నారు. బ్రిక్స్ దేశాల సుసంపన్నమైన నాగరికత కట్టుబాట్లు.. సంప్రదాయ పరిజ్ఞానాన్ని పరిరక్షించడానికి, దానిని లోతుగా అధ్యయనం చేయడానికి, భవిష్యత్ తరాలకు దాని విలువను అందించడానికి ఒక ప్రత్యేకమైన అవకాశాన్ని అందిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

పురాతన కాలం నుంచి విద్య విషయంలో కేంద్రంగా ఉన్న ఒడిశా వారసత్వాన్ని, 'అతిథి దేవో భవ, వసుధైవ కుటుంబకం' అనే భారతదేశపు శాశ్వత నాగరికత విలువలను కూడా మంత్రి ప్రస్తావించారు. వివిధ దేశాలు తమ సంప్రదాయాలు, అనుభవాలలో భిన్నంగా ఉన్నప్పటికీ.. వాటి పురోగతి పరస్పరం అనుసంధానమై ఉందని ఆయన చెప్పారు.

బ్రిక్స్ విద్యా రంగానికి సంబంధించిన సహకారాన్ని ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో జరిగిన ఈ సమావేశానికి బ్రెజిల్, రష్యా, చైనా, దక్షిణాఫ్రికా, ఇండోనేషియా, ఇరాన్, ఇథియోపియా, యూఏఈ (యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్) సహా బ్రిక్స్ సభ్య దేశాల మంత్రులు, ఉన్నతాధికారులు, ప్రతినిధులు హాజరయ్యారు.

# డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్




ఖమ్మం, ఆగష్టు 8: ఖమ్మం నగరంలోని కవిత డిగ్రీ కళాశాలలో శుక్రవారం మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఖమ్మం డివిజన్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి. సోమిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్, అధ్యాపకులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్ అంధకారంలోకి వెళ్లే ప్రమాదం ఉందని అధికారులు తెలిపారు.

తాత్కాలిక ఆనందం కోసం డ్రగ్స్‌కు అలవాటు పడితే కుటుంబంతో పాటు సమాజంపైనా తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉండి మాదకద్రవ్యాలకు సంబంధించిన ప్రలోభాలకు దూరంగా ఉండాలని సూచించారు.

డ్రగ్స్ కేసుల్లో చిక్కుకున్న వారికి చట్ట ప్రకారం కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. మాదకద్రవ్యాల విక్రయాలు, రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే ఎక్సైజ్ శాఖ అధికారులకు తెలియజేయాలని కోరారు.

యువత తమ లక్ష్యాలను సాధించేందుకు చదువుపై దృష్టి సారించి కృషి చేయాలని సూచించారు. మంచి విద్య, క్రమశిక్షణ, నైతిక విలువలతోనే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.

## ఏబీహెచ్‌ఏ-ఆధారిత 'స్కాన్ అండ్ రిజిస్టర్' సేవ ద్వారా

# 25 కోట్ల ఓపీడీ నమోదులతో కీలక మైలురాయిని సాధించిన నేషనల్ హెల్త్ అథారిటీ

న్యూఢిల్లీ, ఆగష్టు 8:దేశంలో డిజిటల్ ఆరోగ్య సంరక్షణ సేవల పంపిణీ అభివృద్ధి దిశగా కీలక ముందడుగు పడింది. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కింద అందించే 'స్కాన్ అండ్ రిజిస్టర్ సేవ' (గతంలో 'స్కాన్ అండ్ షేర్ సేవ'గా పిలిచేవారు) 25 కోట్ల ఓపీడీ రిజిస్ట్రేషన్ల మైలురాయిని దాటింది. ఇది దేశవ్యాప్తంగా డిజిటల్ ఆరోగ్య సేవల వినియోగంలో పెరుగుదలను స్పష్టం చేసింది. 2022, అక్టోబర్ నెలలో ప్రారంభమైనప్పటి నుంచి ఈ సేవ... ఒక సాధారణ క్యూఆర్-కోడ్ స్కాన్ ద్వారా రోగులు డిజిటల్‌గా ఆసుపత్రిలో ఓపీడీ కోసం రిజిస్ట్రేషన్‌ను పూర్తి చేయడానికి వీలు కల్పిస్తూ, ఈ అనుభవాన్ని సులభతరం చేసింది. తద్వారా ఈ ప్రక్రియను వేగవంతం చేస్తూ, మరింత సౌకర్యవంతంగా మార్చింది.

ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కింద పౌర కేంద్రిత డిజిటల్ సేవలు వేగంగా విస్తరించడాన్ని ఈ మైలురాయి స్పష్టం చేస్తోంది. దేశవ్యాప్తంగా ఏబీహెచ్‌ఏ-ఆధారిత డిజిటల్ ఆరోగ్య పరిష్కారాలను ప్రజలు వినియోగిస్తున్న తీరునూ ఇది ప్రతిబింబిస్తోంది. 'స్కాన్ అండ్ రిజిస్టర్' సేవ ద్వారా రోగులు ఏదైనా ఏబీడీ ఎం-అనుమతి గల పర్సనల్ హెల్త్ రికార్డ్ (పీహెచ్ఆర్) అప్లికేషన్‌ను ఉపయోగించి, భాగస్వామ్య ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో ప్రదర్శించే ప్రత్యేక క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు. సమ్మతిని అందించిన తర్వాత, రోగులు తమ ఏబీహెచ్‌ఏ ప్రొఫైల్‌ను ఆరోగ్య సంరక్షణ కేంద్రంతో సురక్షితంగా పంచుకోవచ్చు. మాన్యువల్ రిజిస్ట్రేషన్, కాగితపు ఫారంల అవసరం లేకుండానే తక్షణం ఓపీడీ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ కౌంటర్ల వద్ద వేచి ఉండే సమయాన్ని గణనీయంగా తగ్గించడంతో పాటు, ఆరోగ్య సంరక్షణ ప్రదాతల కార్యాచరణ సామర్థ్యాన్నీ ఈ సేవ మెరుగు పరుస్తుంది. 25 కోట్ల 'స్కాన్ అండ్ రిజిస్టర్' లావాదేవీలను సాధించడం... భారత డిజిటల్ ఆరోగ్య వ్యవస్థపై పౌరులు, ఆరోగ్య సంరక్షణ ప్రదాతలకు పెరుగుతున్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ 'స్కాన్ అండ్ రిజిస్టర్' సేవను ప్రారంభించిన పుటి నుంచి... దేశంలోనే అత్యంత విస్తృతంగా వినియోగిస్తున్న డిజిటల్ ఆరోగ్య సేవల్లో ఒకటిగా ఇది అవతరించింది. ఇది లక్షలాది మంది రోగులకు నిరాటంకమైన ఓపీడీ రిజిస్ట్రేషన్‌ను సులభతరం చేయడంతో పాటు, ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో డిజిటల్ సేవల వంపిణీని బలోపేతం చేస్తోంది.'స్కాన్ అండ్ రిజిస్టర్' సేవ ప్రస్తుతం దేశవ్యాప్తంగా 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 756 జిల్లాల్లో గల 30,800 ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో అందుబాటులో ఉంది. వీటిలో 24,323 ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు కాగా, 6,481 ప్రైవేట్ ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు ఉన్నాయి. వివిధ రకాల ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో ఈ సేవ వేగంగా విస్తరించడం... ఏబీడీఎం (ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్) కింద డిజిటల్ ఆరోగ్య సేవల బలోపేతం కోసం కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు, ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు, డిజిటల్ పరిష్కార సంస్థల సమష్టి కృషిని తెలియజేస్తుంది. సగటున, ప్రతిరోజూ దాదాపు 4 లక్షల మంది రోగులు ఓపీడీ రిజిస్ట్రేషన్ కోసం 'స్కాన్ అండ్ రిజిస్టర్' సేవను ఉపయోగిస్తున్నారు. ఇది డిజిటల్ హెల్త్‌కేర్ సేవల పట్ల ప్రజల్లో పెరుగుతున్న నమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది. మహిళలు, వయోవృద్ధులు, గర్భిణీ స్త్రీలు, తరచుగా ఆసుపత్రిని సందర్శించాల్సిన వ్యక్తులు సహా లక్షలాది మంది లబ్ధిదారులకు ఆసుపత్రిలో ఓపీడీ రిజిస్ట్రేషన్ అనుభవాన్ని ఈ సేవ సులభతరం చేసింది.

# శాస్త్రీయ విధానంలో గనుల మూసివేతలో, వాడకంలో లేని గనులను సుస్థిరమైన సామాజిక ఆస్తులుగా మార్చడంలో ముందున్న ఎస్ఈసీఎల్

న్యూఢిల్లీ, ఆగష్టు 8:శాస్త్రీయ విధానంలో గనుల మూసివేతలో సౌత్ ఈస్టర్న్ కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎస్ఈసీఎల్) భారతదేశంలోనే ముందంజలో ఉంది. వాడకంలో లేని 28 గనులను శాస్త్రీయ విధానంలో విజయవంతంగా మూసివేసింది. కోల్ ఇండియా అనుబంధ సంస్థల్లో ఇదే అత్యధికం. దేశవ్యాప్తంగా శాస్త్రీయ విధానంలో మూసివేసిన గనుల్లో 67 శాతం ఈ సంస్థకు సంబంధించినవే. ఆర్థిక సంవత్సరం 2025-26లో 25 గనులను శాస్త్రీయంగా మూసివేసింది. భారతదేశంలోని ఏ సంస్థ అయినా ఒక ఏడాదిలో అత్యధికంగా మూసివేసిన గనుల సంఖ్య ఇది.

గనుల మూసివేతను గనుల తవ్వకానికి ముగింపుగా కాకుండా ఆ గని జీవితకాలంలో సమగ్ర భాగంగా ఎస్ఈసీఎల్ పరిగణిస్తుంది. బొగ్గును వెలికితీయడం పూర్తయిన తర్వాత ఆ భూభాగాన్ని రక్షించడం, పునరుద్ధరించడం, భవిష్యత్తులో ఉత్పాదక వినియోగం కోసం భూమిని సిద్ధం చేయడంపై దృష్టి సారిస్తారు. దీనికోసం శాస్త్రీయ పునరుద్ధరణ, పునర్వినియోగ పద్ధతులను అవలంబిస్తారు.

శాస్త్రీయ విధానంలో మూసివేయడానికి వినియోగంలో లేని 54 గనులను ఎస్ఈసీఎల్ గుర్తించింది. వాటిలో ఆర్థిక సంవత్సరం 2024-25లో మూడు గనులను మూసివేయగా, ఆర్థిక సంవత్సరం 2025-26లో 25 గనులను మూసివేసింది. మరో 11 గనులను 2026-27 ఆర్థిక సంవత్సరంలోనూ, మిగిలిన 15 గనులను 2027-28 ఆర్థిక సంవత్సరంలోనూ మూసివేయాలని సంస్థ లక్ష్యంగా నిర్దేశించుకుంది. గుర్తించిన గనులను శాస్త్రీయ విధానంలో దశల వారీగా మూసివేస్తోంది.

ప్రణాళికను, ఈ రంగంలోని నిపుణుల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లో బొగ్గు తవ్వకాలు జరిగే 10 జిల్లాల్లో జిల్లా గనుల మూసివేత సలహా కమిటీ (డీఎంసీఏసీ)లు ఏర్పాటయ్యాయి.

భూగర్భ ప్రవేశ మార్గాలను శాశ్వతంగా మూసివేయడం, వినియోగంలో లేని మౌలిక వసతులను కూల్చివేయడం, కుంగిపోయిన ప్రాంతాలను బాగు చేయడం, భద్రతా చర్యలను ఏర్పాటు చేయడం, భూమిని పునరుద్ధరించడం, మొక్కలు నాటడం, పర్యావరణ పునరుద్ధరణ ద్వారా తవ్వకాలు పూర్తయిన గనులను శాస్త్రీయ పద్ధతుల్లో ఎస్ఈసీఎల్ మూసివేస్తోంది. పునరుత్పాదక విద్యుత్తు, సామాజిక మౌలిక వసతులు, జీవనోపాధి, పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు ఇచ్చేలా పునరుద్ధరించిన భూమిని ఉత్పాదక పునర్వినియోగం కోసం అంచనా వేస్తారు. ప్రస్తుతం ఎనిమిది గనుల పునరుద్ధరణ ప్రాజెక్టులను సంస్థ అమలు చేస్తోంది.

ప్రధాన కార్యక్రమాల్లో భాగంగా బిశ్రామ్‌పూర్‌లో పునరుద్ధరించిన గని ప్రాంతంలో కెనాపారా ఎకో పార్కును అభివృద్ధి చేశారు. వివేక్ నగర్ యూజీ వద్ద ఎకో పార్కుతో అనుసంధానించిన 5 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణంలో ఉంది. భట్గావ్, బిశ్రామ్‌పూర్‌లో 20 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఇప్పటికే ఎస్ఈసీఎల్ ప్రారంభించింది. అలాగే పినౌరా యూజీ వద్ద 40 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టు కూడా నిర్మాణంలో ఉంది. అదనంగా పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి కోసం పునరుద్ధరించిన గనుల భూముల ఉత్పాదక వినియోగాన్ని విస్తరిస్తూ... జమునా యూజీ, గోవిందా యూజీ వద్ద 55 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టును నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

శాస్త్రీయంగా మూసివేసిన అనేక గనులను ప్రజా మౌలిక సదుపాయాలుగా మార్చారు. కోర్బా 3 అండ్ 4 యూజీలో పునరుద్ధరించిన గని భూమిని బాల విహార్ హయ్యర్ సెకండరీ స్కూల్ క్యాంపస్‌లో విలీనం చేశారు. ఒక పబ్లిక్ పార్కుకు, నీటి శుద్ధి కర్మాగారానికి ఉత్తర జార్ఖండ్ యూజీ తోడ్పాటును అందిస్తోంది. సుభాష్ ఇంక్లైన్‌లోని పాత సేవా భవనాన్ని మున్సిపల్ వాటర్ ఫిల్టర్ కేంద్రంగా మార్చారు. దక్షిణ జార్ఖండ్ 5 అండ్ 6 యూజీలో ఒకప్పటి మైన్ సర్వీస్ భవనాన్ని సీఐఎస్ఎఫ్ పోస్టుగా మార్చారు. అలాగే దక్షిణ జార్ఖండ్ 10 అండ్ 11 యూజీని పబ్లిక్ పార్కుగా అభివృద్ధి చేశారు. బంకి 7 అండ్ 8 యూజీలో ఇప్పుడు ఆరోగ్య కేంద్రాన్ని, వారపు సంతను నిర్వహిస్తున్నారు. అలాగే బంకి 5 అండ్ 6 యూజీని కమ్యూనిటీ సెంటర్‌గా అభివృద్ధి చేశారు.

ప్రతి గని మూసివేత ప్రాజెక్టులో పర్యావరణ పునరుద్ధరణ ప్రధానాంశంగా ఉంటుంది. చచాయ్ యూజీలో దాదాపు 35,000 మొక్కలు నాటారు. గని మార్గాలను మూసివేసి, పాత నిర్మాణాలను కూల్చివేసిన అనంతరం ఈ మొక్కలను నాటారు. రామ్ నగర్ యూజీ, కొరియా యూజీ, మాల్గా యూజీతో సహా వివిధ గని ప్రాంతాల్లో అడవులను అభివృద్ధి చేశారు. అలాగే పర్యావరణ పునరుద్ధరణకు తోడ్పడేలా రాజ్‌గమార్ 8 అండ్ 9 యూజీ, ప్యూర్ చిరిమిరి యూజీ వద్ద సహజంగా పెరిగిన వృక్ష సంపదను పరిరక్షించారు.

పునరుద్ధరించిన గనుల ప్రాంతాల్లో పర్యావరణ పునరుజ్జీవంతో పాటు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను, ఆరోగ్య శిబిరాలను ఎస్ఈసీఎల్ నిర్వహించింది. ప్రాజెక్టు ప్రభావిత వర్గాల కోసం కంప్యూటర్ విద్య, టైలరింగ్, చేతివృత్తులు, పుట్టగొడుగుల పెంపకం, పచ్చళ్ల తయారీ, ఇతర జీవనోపాధి కార్యక్రమాల్లో శిక్షణ అందించింది.

పునరుద్ధరించిన గనుల భూమిని, గని జల వనరులను ఉత్పాదకంగా వినియోగించడం ద్వారా సుస్థిర జీవనోపాధిని కూడా ఈ సంస్థ ప్రోత్సహిస్తోంది. మత్స్య పెంపకం కార్యక్రమాలు ఏటా 25 టన్నుల చేపల ఉత్పత్తికి తోడ్పడతాయని, 206 జీవనోపాధి అవకాశాలను కల్పిస్తాయని, దీనిలో భాగమైన ప్రతి కుటుంబానికి రూ.3 లక్షల వార్షికాదాయం పొందే వీలు ఉందని అంచనా వేశారు.

స్థానిక పరిస్థితులు, భవిష్యత్తులో భూ వినియోగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని జమునా ఓసీలో ఎకోటూరిజం, మత్స్య పెంపకం, పౌల్ట్రీ ఫార్మింగ్, మసాలా ప్రాసెసింగ్, బైగా ఓసీలో తేనె శుద్ధి, పసుపు సాగు, కేజ్ కల్చర్, బంకి యూజీలో శిక్షణ కేంద్రం, కంప్రెస్డ్ బయో గ్యాస్ (సీబీజీ) కేంద్రం, ఫల వృక్షాల పెంపకాన్ని భవిష్యత్తు పునరువయోగ ప్రతిపాదనల్లో చేర్చారు.

గనుల జీవితకాలాన్ని బాధ్యతాయుతంగా పూర్తిచేయడాన్ని, సుస్థిర గనుల తవ్వకంలో సంస్థ నిబద్ధతను శాస్త్రీయ విధానంలో గనుల మూసివేత ప్రతిబింబిస్తుందని ఎస్ఈసీఎల్ ఛైర్మన్‌కమ్‌మేనేజింగ్ డైరెక్టర్ హరీష్ దుహాన్ చెప్పారు.

"ఎస్ఈసీఎల్‌లో గనిని మూసివేయడం అంటే అది మైనింగ్‌కు ముగింపు కాదు. అది నూతన అధ్యాయానికి ఆరంభం. భూమిని పునరుద్ధరించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం, పునరుద్ధరించిన గనుల ప్రాంతాలను శుద్ధ విద్యుత్తును ఉత్పత్తి చేసే, జీవనోపాధికి తోడ్పడే, స్థానిక సమాజాలకు సేవ చేసే ఉత్పాదక ఆస్తులుగా మార్చడమే మా లక్ష్యం. బాధ్యతాయుతమైన మైనింగ్, సుస్థిర అభివృద్ధి పట్ల మా నిబద్ధతను శాస్త్రీయ పద్ధతిలో మూసివేసిన ప్రతి గని తెలియజేస్తుంది" అని దుహాన్ అన్నారు.

# హుజూర్‌నగర్ పీఆర్టీయూ మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

నల్గొండ, ఆగష్టు 8: హుజూర్‌నగర్ మండల పీఆర్టీయూ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గొట్టే శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా నిమ్మగంటి నరసయ్య, అసోసియేట్ అధ్యక్షుడిగా కొప్పుల బ్రహ్మరెడ్డి, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా ఎం. షర్మిలకుమారి ఎన్నికయ్యారు.


ఉపాధ్యక్షులుగా సిరికొండ వెంకటయ్య, మహిళా ఉపాధ్యక్షురాలిగా ఎస్. వీరమ్మ, కార్యదర్శులుగా జెల్లా సత్యనారాయణ, కీత శ్రీనివాస్, ఎం.డి. నజీమా అంజుమ్, చడపంగు జయమ్మ ఎన్నికైనట్లు పీఆర్టీయూ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు తంగెళ్ల జితేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తీగల సురేష్ తెలిపారు.

నూతనంగా ఎన్నికైన పీఆర్టీయూ హుజూర్‌నగర్ మండల కమిటీ సభ్యులకు జిల్లా నాయకులు అభినందనలు తెలిపారు. రెండేళ్ల పదవీకాలంలో చక్కటి పనితీరు కనబరిచి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ సంఘానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పీఆర్టీయూ సంఘాన్ని మరింత ఉన్నత స్థితికి తీసుకెళ్లేలా సమష్టిగా పనిచేయాలని సూచించారు.


ఆహ్వానం

తెలుగు భాషా చైతన్య సమితి
TGSWR మహిళా డిగ్రీ కళాశాల, మహేంద్రహిల్స్
సంయుక్త ఆధ్వర్యంలో

డాక్టర్ నందిని సిధారెడ్డి
సాహిత్య సమాలోచన
(తెలుగు & ఇంగ్లీషు వ్యాస సంకలనం)




పుస్తకావిష్కరణ

ముఖ్యఅతిథి & ఆవిష్కర్త : శ్రీ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, మాజీ మంత్రివర్యులు
సభాధ్యక్షులు : డాక్టర్ వి.జయప్రకాశ్, సంపాదకులు, తెలుగు భాషా చైతన్య సమితి
విశిష్ట అతిథులు : ఆచార్య సి.మృణాళిని, విశ్రాంతాచార్యులు, తెలుగు విశ్వవిద్యాలయం
డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి IAS, సంచాలకులు, భాషా సాంస్కృతిశాఖ, తెలంగాణ
డాక్టర్ ఎన్.బాలాచారి, కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమి
ప్రత్యేక అతిథి : శ్రీ రఘుబాబు ఏలూరి, సీనియర్ జర్నలిస్టు
గౌరవ అతిథి : డాక్టర్ నందిని సిధారెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత; పూర్వ అధ్యక్షులు, తెలంగాణ సాహిత్య అకాడమి
ప్రత్యేక ఆహ్వానితులు : శ్రీ గాజర్ల రమేశ్, డైరెక్టర్, SCERT, తెలంగాణ
ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, పూర్వ అధ్యక్షులు, తెలుగుశాఖ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం
ఆచార్య కోయి కోటేశ్వరరావు, తెలుగుశాఖ అధ్యక్షులు, సిటీ కళాశాల, హైదరాబాద్
ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్, డిపార్ట్మెంట్ ఆఫ్ ఇంగ్లీషు, ఉస్మానియా విశ్వవిద్యాలయం
డాక్టర్ మన్నెమోని కృష్ణయ్య, పాఠ్య ప్రణాళిక సంఘం అధ్యక్షులు, పాలమూరు విశ్వవిద్యాలయం
ఆత్మీయ అతిథులు : డాక్టర్ నాళేశ్వరం శంకరం, అధ్యక్షులు, తెలంగాణ రచయితల సంఘం
డాక్టర్ కందుకూరి శ్రీరాములు, అధ్యక్షులు, తెరసం జంటనగరాలు
డాక్టర్ శ్రీభాష్యం అనురాధ, అధ్యాపకులు, TGSWRWDC, మహేంద్రహిల్స్
శ్రీ పి.బడేసాబ్, వ్యవస్థాపక అధ్యక్షులు, తెలుగు భాషా చైతన్య సమితి
పుస్తక పరిచయం : శ్రీ అవుసుల భానుప్రకాశ్, కవి, రచయిత; అధ్యక్షులు, పద్య సారస్వత పీఠం

తేది & సమయం: 09.08.2026 ఆదివారం ఉదయం 10 గంటలకు
వేదిక: దేవులపల్లి రామానుజరావు కళామందిరం, తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్‌రోడ్డు, అబిడ్స్, హైదరాబాద్.

సాహితీ మిత్రులకు, వ్యాసకర్తలకు సాదర స్వాగతం!

ఆహ్వానం: డాక్టర్ ఎడ్ల కల్లేశ్, ప్రధాన కార్యదర్శి, తెలుగు భాషా చైతన్య సమితి
సమన్వయ సహకారం: శ్రీ లకుమల్ల జగన్, కార్యదర్శి, తెలుగు భాషా చైతన్య సమితి
వందన సమర్పణ: డాక్టర్ లక్ష్మి అసిరెడ్డి, ప్రిన్సిపాల్, TGSWRWDC, మహేంద్రహిల్స్

# సహయోగ్ పోర్టల్ ద్వారా సి2 సర్వర్ల జియో బ్లాకింగ్ ద్వారా ఇప్పటివరకు 10,000 మందికి పైగా భారతీయులకు రక్షణ

న్యూఢిల్లీ, ఆగష్టు 8:ఖాతా స్టేట్‌మెంట్లు, నియంత్రణ సంస్థల సమాచారం పేరిట హానికరమైన ఫైళ్లను పంపుతూ నిపుణులు, వ్యాపారవేత్తల వాట్సాప్ ఖాతాలను దుండగులు తమ ఆధీనంలోకి తెచ్చుకుని దుర్వినియోగం చేస్తున్న ఉదంతాలకు సంబంధించి.. జాతీయ సైబర్ నేరాల నమోదు పోర్టల్ (ఎన్సీఆర్పీ)లో ఫిర్యాదులు భారీగా పెరిగినట్టు హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని భారత సైబర్ నేర నియంత్రణ సమన్వయ కేంద్రం గుర్తించింది. కొన్ని రోజులుగా ఢిల్లీ, గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్ సహా పలు రాష్ట్రాల్లో ఒకే తరహాలో ఇలాంటి మోసాలు నమోదయ్యాయి. ఈ నయా మోసంపై ఐ4సీ ప్రజలను అప్రమత్తం చేసింది. ఈ మేరకు 'నియంత్రణ, ఎగ్జిక్యూటివ్ అధికారుల పేరిట హానికరమైన విండోస్ ఎగ్జిక్యూటబుళ్లతో వాట్సాప్ ఖాతాను ఆధీనంలోకి తెచ్చుకోవడం – భారీ ఆర్థిక మోసాలు' శీర్షికతో 2026 జూన్ 22న ప్రజలకు సూచనలు చేస్తూ మార్గదర్శకాలను జారీ చేసింది.

నమోదైన ఘటనల ప్రకారం.. 'స్టేట్మెంట్ ఆఫ్ అకౌంట్.శితిజూ వంటి పేర్లతో బాధితులకు వాట్సాప్, ఎస్ఎంఎస్ లేదా ఈమెయిల్ ద్వారా ఒక కంప్రెస్డ్ ఫైళ్లు వస్తున్నాయి. వీటిలో చాలావరకు పేర్లకు ముందు తేదీలు ఉంటున్నాయి. RBI.zip', 'MCA.zip లాంటి పేర్లతోనూ ఫైళు వస్తున్నాయి. ఇవి సాధారణ ఖాతా స్టేట్‌మెంట్ల లాగా లేదా ఆర్బీఐ, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వంటి నియంత్రణ సంస్థల అత్యవసర నోటీసుల లాగా కనిపించేలా సందేశాలను రాసి ఫైళ్లతో జతచేస్తున్నారు. వెంటనే వాటిని అనుసరించాలని ఆ సందేశాల్లో డిమాండ్ చేస్తున్నారు. ఈ ఆర్కైవ్‌లో ఒక హానికరమైన విండోస్ ఎగ్జిక్యూటబుల్ , ఒక డైనమిక్ లింక్ లైబ్రరీ ఫైల్ ఉంటున్నాయి. యూజర్లు ఈ ఫైల్‌ను విండోస్ డెస్క్‌టాప్ లేదా ల్యాప్‌టాప్‌లో ఎక్స్‌ట్రాక్ట్ చేసి ఓపెన్ చేసిన వెంటనే.. ఒక ట్రోజన్ వైరస్ అందులో ఇన్‌స్టాల్ అయిపోతుంది. అది ఆ డివైజ్‌ను హ్యాక్ చేసి, అందులో యాక్టివ్‌గా ఉన్న బాధితుడి 'వాట్సాప్ వెబ్' సెషన్‌ను ఆధీనంలోకి తీసుకుంటుంది. చాలా కేసుల్లో ఆదాయపు పన్ను శాఖ పేరిట కూడా ఈ తరహా ఈమెయిళ్లు వచ్చినట్టు గుర్తించారు.

హ్యాక్ చేసిన వాట్సాప్ ఖాతా ద్వారా దుండగులు ఆ బాధితుడి కాంటాక్ట్ లిస్టులో ఉన్న అందరికీ, వివిధ గ్రూప్‌లకు అదే హానికరమైన ఫైల్‌ను ఆటోమేటిక్‌గా పంపుతున్నారు. "ఈ ఫైలును మీ కంపెనీ ఫైనాన్స్ మేనేజరుకు పంపి ధ్రువీకరించుకోండి'' అంటూ ఓ అభ్యర్థనను కూడా దానికి జోడిస్తున్నారు. కంప్యూటరులో దాన్ని ఓపెన్ చేయాలంటూ కోరుతున్నారు. దీంతో కార్పొరేట్ నెట్‌వర్కుల్లో ఈ వైరస్ మరింత వేగంగా విస్తరిస్తోంది. ఇక అసలు కథ అప్పుడు మొదలవుతుంది. సాధారణంగా ఈ సైబర్ నేరాన్ని 'బాస్ స్కామ్' లేదా 'నకిలీ సీఈవో' పేరుతో పిలుస్తారు. దుండగులు సంస్థలోని సీనియర్ ఎగ్జిక్యూటివ్‌కు చెందిన అసలైన వాట్సాప్ ఖాతాను వాడుతారు.. లేదంటే హ్యాక్ చేసిన డివైజ్‌లో సైబర్ నేరగాళ్లు తమ నియంత్రణలో ఉన్న నంబరును సదరు కంపెనీ 'సీఈవో' పేరుతో రహస్యంగా సేవ్ చేస్తారు. ఆపై అత్యవసరంగా డమ్మీ (మ్యూల్) బ్యాంకు ఖాతాలకు నిధులను మళ్లించాలంటూ సంస్థలోని అకౌంట్స్, ఫైనాన్స్ విభాగపు ఉద్యోగులకు ఆ ఖాతా ద్వారా ఆదేశాలు పంపుతారు.

విదేశాల నుంచి కార్యకలాపాలను కొనసాగిస్తున్న వ్యవస్థీకృత నెట్‌వర్కులు ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నాయని, అత్యాధునిక పద్ధతుల్లో అధునాతన మాల్వేర్‌ను దుండగులు వ్యాప్తి చేస్తున్నారని, డీఎల్ఎల్ సైడ్‌లోడింగ్ పద్ధతి ద్వారా దొరక్కుండా తప్పించుకునే సామర్థ్యాలున్న అత్యాధునిక మాల్వేర్‌ను ఉపయోగిస్తున్నారని ఐ4సీకి చెందిన జాతీయ సైబర్ నేరాల ప్రమాద విశ్లేషణ విభాగం (ఎన్సీటీఏయూ) సాంకేతిక విశ్లేషణలో తెలిసింది. చట్టాలను అమలు చేసే సంబంధిత సంస్థలు, సాంకేతిక సంస్థలు సమన్వయంతో వ్యవహరిస్తూ దర్యాప్తును కొనసాగిస్తున్నాయి.

విండోస్ కంప్యూటర్లలో మాత్రమే ఈ మాల్వేర్ పనిచేస్తుండడం, పంపుతున్న ఫైళ్లు కూడా ఖాతా స్టేట్‌మెంట్లు, నియంత్రణ సంస్థల నిబంధనలకు సంబంధించినవిగా ఉంటుండడంతో... చార్టర్డ్ అకౌంటెంట్లు, కంపెనీ డైరెక్టర్లు, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్లు, కంపెనీల ఫైనాన్స్, అకౌంట్స్ విభాగాల సిబ్బందికి ఈ మోసంతో తీవ్రమైన ముప్పు పొంచి ఉంది. కార్పొరేట్ సంస్థలన్నీ తమ ఉద్యోగులను, ముఖ్యంగా ఫైనాన్స్ బృందాలను తక్షణమే అప్రమత్తం చేయాలని ఐ4సీ సూచిస్తోంది. నిధుల మళ్లింపు, లేదా బ్యాంక్ ఖాతా వివరాల మార్పులకు సంబంధించి – వాట్సాప్ లేదా ఈమెయిల్ ద్వారా ఎలాంటి అత్యవసర ఆదేశాలు వచ్చినా.. నేరుగా ఫోన్ కాల్ చేసి లేదా స్వయంగా కలిసి మాట్లాడి ధ్రువీకరించుకోవాల్సిందిగా సూచిస్తోంది.

తెలియని లేదా ధ్రువీకృతం కాని మూలాల నుంచి వచ్చిన .శితిజూ ఫైళ్లను లేదా ఎగ్జిక్యూటబుళ్లను డౌన్‌లోడ్ చేయొద్దు, ఎక్స్‌ట్రాక్ట్ చేయొద్దు లేదా తెరవొద్దు. ఆర్బీఐ వంటి నియంత్రణ సంస్థలు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్లనూ, భద్రతాపరమైన అంశాలనూ లేదా ఖాతా స్టేట్‌మెంట్‌లను ఎప్పుడూ వాట్సాప్ ద్వారా అందించవు.

వాట్సాప్ యాప్‌లో (రావబిబితినిణబ ∩ ఒతినినెవట ఆవలతిఇవబ) లింక్ అయి ఉన్న డివైజ్‌లను ఎప్పటికప్పుడు సమీక్షించండి. ఉపయోగించని వాట్సాప్ వెబ్ సెషన్ల నుంచి వెంటనే లాగవుట్ చేయండి.

యూజర్ ప్రొఫైల్ డైరెక్టరీల నుంచి అపరిచిత .వలీవ, .టశ్రీశ్రీ ఫైళ్లు ఎగ్జిక్యూట్ అవ్వకుండా అడ్డుకునేలా సాఫ్ట్‌వేర్ నియంత్రణ విధానాలను సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్లు అమలు చేయాలి. అలాగే విండోస్ వాడే అన్ని కంప్యూటర్లలో అప్‌డేట్ చేసిన యాంటీ మాల్వేర్ సాఫ్ట్‌వేర్ సేవలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి.

ఒకవేళ ఖాతా హ్యాక్‌కి గురైతే.. లింక్ అయి ఉన్న అన్ని డివైజ్‌ల నుంచి వెంటనే లాగవుట్ చేయాలి. సదరు ఖాతా నుంచి వచ్చే ఎలాంటి ఫైళ్లనూ ఓపెన్ చేయవద్దని కాంటాక్టులకు వెంటనే సమాచారాన్ని అందించాలి. అప్‌డేట్ చేసిన యాంటీవైరస్‌తో కంప్యూటర్‌ను స్కాన్ చేయాలి.

సైబర్ మోసాలు, ఇలాంటి అనుమానాస్పద కమ్యూనికేషన్లను ఎంతమాత్రమూ ఉపేక్షించకూడదు. జాతీయ సైబర్ నేరాల హెల్ప్‌లైన్ నంబర్ 1930 లేదా జాతీయ సైబర్ నేరాల నమోదు పోర్టల్ లో వెంటనే వీటిపై ఫిర్యాదు చేయాలి. వివరణాత్మక సూచనలు పోర్టల్‌లో అందుబాటులో ఉన్నాయి.

# శిల్పకళా వైభవానికి ప్రతీక.. బోధన్ వంద స్తంభాల గుడి




నిజామాబాద్, ఆగష్టు 8:చారిత్రక ప్రాశస్త్యం కలిగిన బోధన్ వంద స్తంభాల గుడిని ప్రభుత్వం వెంటనే పరిరక్షించి అభివృద్ధి చేయాలని ఛత్రపతి యువజన సంఘం డిమాండ్ చేసింది. చారిత్రక కట్టడం ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురై శిథిలావస్థకు చేరుతున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని సంఘం అధ్యక్షుడు అడ్లూరి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు.

బోధన్ పట్టణంలోని మాహాలక్ష్మి కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బోధన్‌కు ప్రాచీన చరిత్ర ఉందని, పట్టణంలోని వంద స్తంభాల గుడికి కూడా విశిష్టమైన చారిత్రక ప్రాధాన్యం ఉందని తెలిపారు. రాష్ట్రంలోని రామప్ప దేవాలయం, వేయి స్తంభాల గుడి, గోల్కొండ కోట వంటి చారిత్రక కట్టడాలను పరిరక్షిస్తున్న తరహాలోనే బోధన్ వంద స్తంభాల గుడిని కూడా ప్రభుత్వం సంరక్షించాలని కోరారు.

ఆలయాన్ని పురావస్తు శాఖ పరిధిలోకి తీసుకుని శాస్త్రీయ పద్ధతుల్లో పరిరక్షణ, అభివృద్ధి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆలయంలో పూజలకు అనుమతి కల్పించడంతో పాటు, వంద స్తంభాల గుడి చరిత్రపై నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి సమగ్ర పరిశోధన చేపట్టాలని కోరారు. ఈ అంశంపై గత నెల 21న ప్రభుత్వానికి న్యాయ నోటీసులు పంపినట్లు అడ్లూరి శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మ్యూజియం శాఖ, ఎండోమెంట్స్ శాఖ, నిజామాబాద్ జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ తదితరులకు నోటీసులు అందజేసినట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వం 50 రోజుల్లో సానుకూలంగా స్పందిస్తుందనే నమ్మకం ఉందని, స్పందన లేకపోతే న్యాయపరంగా కోర్టులను ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.

వంద స్తంభాల గుడి పరిరక్షణ కోసం అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, చరిత్రకారులు, మేధావులు, విద్యార్థులు, యువత కలిసి ఉద్యమించాలని ఛత్రపతి యువజన సంఘం పిలుపునిచ్చింది. ఈ అంశంలో రాజకీయ విభేదాలకు తావులేకుండా శాంతియుతంగా, న్యాయబద్ధంగా పోరాటాన్ని కొనసాగిస్తామని సంఘం ప్రతినిధులు తెలిపారు.

కార్యక్రమంలో గోపి కిషన్, గౌడుగు ధర్మపురి, బుమేష్, దుర్గాప్రసాద్, శివరాజ్, పవన్, గౌతమ్, పెరిక వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# మూలాలను మరువొద్దు.. మత్తులో పడొద్దు!

## –బాల్కొండ పాఠశాలలో ఘనంగా వ్యక్తిత్వ వికాస సదస్సు

నిజామాబాద్, ఆగష్టు 8: మనిషి జీవితంలో ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా తన మూలాలను ఎన్నటికీ మరువకూడదని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని ప్రముఖ రచయిత, కవి, యువ సలహాదారు, ప్రబోధ సంస్థ జాతీయ అధ్యక్షుడు, వ్యవస్థాపకుడు ఎంఎస్ఆర్ ప్రబోధ సుమేర్ సూచించారు.

భీమ్‌గల్‌లోని టీజీఎం ఆర్ఈఐఎస్ బాల్కొండ బాలుర పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణాత్మక, వ్యక్తిత్వ వికాస సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇదే పాఠశాలలో తొలి బ్యాచ్ విద్యార్థిగా చదువుకున్న ప్రబోధ సుమేర్.. తన బాల్య జ్ఞాపకాలను విద్యార్థులతో పంచుకుంటూ వారిలో స్ఫూర్తిని నింపారు.

### మూలాలను మరువొద్దు

తల్లి గర్భం నుంచి భూతల్లి ఒడిలోకి వచ్చామని, ఈ భూమి, మనం ఒకే తల్లి బిడ్డలమని ప్రబోధ సుమేర్ అన్నారు. మనం ఎక్కడ పుట్టాం, ఎక్కడి నుంచి వచ్చామనే విషయాలను ఎప్పటికీ మర్చిపోకుండా మూలాలను గుర్తుంచుకోవాలని విద్యార్థులకు సూచించారు.

### విద్యే భవిష్యత్తుకు పునాది

విద్యే ఉత్తమ భవిష్యత్తుకు బలమైన పునాది అని ఆయన అన్నారు. కష్టపడి చదివిస్తూ తమ భవిష్యత్తు కోసం తపించే తల్లిదండ్రులను, విద్యాబుద్ధులు నేర్పే గురువులను ఎల్లప్పుడూ గౌరవించాలని సూచించారు. విద్యార్థులు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగి సమాజానికి ఉపయోగపడేలా తమ జీవితాలను తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు.

ధూమపానం, మద్యపానం, మాదకద్రవ్యాలు వంటి వ్యసనాలకు యువత పూర్తిగా దూరంగా ఉండాలని ప్రబోధ సుమేర్ హెచ్చరించారు. వ్యసనాలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా వ్యక్తి భవిష్యత్తును, కుటుంబాన్ని కూడా ప్రభావితం చేస్తాయని తెలిపారు. సమాజంలో గౌరవంగా జీవించాలంటే చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.

### 'నషా ముక్త్ భారత్' ప్రతిజ్ఞ

మాదకద్రవ్యాల రహిత భారతదేశ నిర్మాణానికి కట్టుబడి ఉంటామని విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రబోధ సుమేర్ ప్రతిజ్ఞ చేయించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, ఇతరులను కూడా వాటికి దూరంగా ఉండేలా చైతన్యపరచాలని పిలుపునిచ్చారు.

### గురువులకు కృతజ్ఞతలు

దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులకు మార్గదర్శకుడిగా నిలవడంతో పాటు 43కి పైగా పుస్తకాలు రచించడానికి తన పాఠశాల గురువుల మార్గదర్శకత్వమే ప్రధాన కారణమని ప్రబోధ సుమేర్ తెలిపారు. తనకు ఎంతో అనుబంధం ఉన్న 'రెండో ఇంటికి' తిరిగి వచ్చి విద్యార్థులతో తన అనుభవాలను పంచుకునే అవకాశం కల్పించిన పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

తమ పాఠశాలలో తొలి బ్యాచ్‌లో చదువుకుని జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన అనంతరం తిరిగి పాఠశాలకు వచ్చిన ప్రబోధ సుమేర్‌ను ప్రిన్సిపాల్, ఆయన పాత గురువులు, ఉపాధ్యాయులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, ఉపాధ్యాయ బృందం ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ఐటీ నిబంధనలు 2021 ప్రకారం మద్యం, పొగాకు సంబంధిత కంటెంట్ కోసం వర్గీకరణ తప్పనిసరి

న్యూ ఢిల్లీ, ఆగష్టు 8:డిజిటల్ మీడియాలో వచ్చే వార్తలు, సమకాలీన విషయాల ప్రచురణ కర్తలతో పాటు ఓటీటీ వేదికల ప్రచురణకర్తలను పర్యవేక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ఐటీ చట్టం 2000 కింద 25, ఫిబ్రవరి 21న సమాచార సాంకేతికత (మధ్యవర్తుల మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా నైతిక నియమావళి) నిబంధనలు 2021ను తీసుకువచ్చింది.

ఈ నిబంధనల్లోని రెండో విభాగం కింద డిజిటల్ వార్తా ప్రచురణకర్తలు, ఓటీటీ వేదికల ప్రచురణకర్తల కోసం ప్రత్యేకంగా ఒక నైతిక నియమావళిని రూపొందించారు.ఐటీ నిబంధనలు 2021 ప్రకారం చట్టవిరుద్ధమైన, నిషేధించిన ఎటువంటి కంటెంట్‌ను కూడా ఓటీటీ వేదికలు ప్రసారం చేయడానికి వీల్లేదు. అలాగే కంటెంట్‌ను ప్రసారం చేసేటప్పుడు వారు జాగ్రత్తగా, విచక్షణతో వ్యవహరించాల్సి ఉంటుంది. నిబంధనల షెడ్యూల్‌లో పేర్కొన్న ప్రమాణాల ఆధారంగా కంటెంట్‌ను వర్గీకరించడం తప్పనిసరి. ఇందులో భాగంగా కంటెంట్‌లోని ప్రధాన అంశాలు, సందేశాలు, హింస, నగ్నత్వం, సెక్స్, భాష, మాదక ద్రవ్యాలు, మత్తుపదార్థాల దుర్వినియోగం, హారర్ అంశాల ఆధారంగా రేటింగ్‌లు ఇవ్వాల్సి ఉంటుంది. ఐటీ నిబంధనలు–2021 షెడ్యూల్‌లోని రెండో విభాగం ప్రకారం ఓటీటీ వేదికల్లో చూపించే కంటెంట్ వర్గీకరణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను నిర్దేశించింది. ముఖ్యంగా మత్తు పదార్థాలు, మద్యం, ధూమపానం, పొగాకు ఉత్పత్తులు, సమాజంలో ఇతరులు సులభంగా అనుకరించే ప్రమాదకర ప్రవర్తనలను చూపించే కంటెంట్‌ను ఎలా వర్గీకరించాలనే దానిపై కఠినమైన నియమాలు ఉన్నాయి.

ఓటీటీ సంస్థలు ఈ నైతిక నియమావళిని ఉల్లంఘిస్తే, వాటిపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించడానికి చట్టంలో పటిష్టమైన మూడు అంచెల ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఏర్పాటు చేశారు. కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు అందే ఇలాంటి ఫిర్యాదులను, ఐటీ నిబంధనల ప్రకారం తగిన పరిష్కారం కోసం వెంటనే సంబంధిత ఓటీటీ వేదికలకు పంపడం జరుగుతుంది.

# పండుగల సాయన్నకు ఘన నివాళులు

మహబూబ్‌నగర్, ఆగష్టు 8:తెలంగాణ రాబిన్‌హుడ్ పండుగల సాయన్న జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు వెంకటరాములు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్, మాజీ ఎంపీటీసీ హన్మంతు, వాణిజ్య సెల్ జిల్లా కన్వీనర్ కృష్ణయ్య గౌడ్, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కొండన్ గోపాల్, మత్స్య సహకార సంఘం ఉపాధ్యక్షుడు వెంకటస్వామి డిమాండ్ చేశారు.

శనివారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలోని ఎల్బీనగర్ పడమటి ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో ముదిరాజ్ మత్స్య సంఘం ఆధ్వర్యంలో పండుగల సాయన్న జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పండుగల సాయన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో చెక్‌పోస్ట్ వద్ద పండుగల సాయన్న విగ్రహాన్ని ఏర్పాటు చేసుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజల కోసం పోరాడిన మహావీరుడు, తెలంగాణ గర్వకారణమైన ప్రజా వీరుడు పండుగల సాయన్న జయంతిని పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించాలని అన్నారు.

బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం తన జీవితాన్ని అంకితం చేసి, పెత్తందారీ వ్యవస్థను ధైర్యంగా ఎదిరించిన పండుగల సాయన్న స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆయన త్యాగం, ధైర్యం, ప్రజాసేవ, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం భావితరాలకు ఆదర్శంగా నిలిచేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

తెలంగాణ ప్రభుత్వం పండుగల సాయన్న సేవలను అధికారికంగా మరింత గుర్తించి, ఆయన చరిత్రను భావితరాలకు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ముదిరాజ్, మత్స్య సంఘం నాయకులు భరత్, ఎన్. అశోక్‌కుమార్, ముద్దం రాము, ఆశన్న, లక్ష్మణ్, నాగేష్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు

# ఉద్యమకారుల దరఖాస్తులు గ్రామాలకే వచ్చి సేకరించాలి



ఆదిలాబాద్, ఆగష్టు 8:తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న నిజమైన ఉద్యమకారులను గుర్తించి వారికి తగిన గౌరవం కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కే. కేశవరావు కమిటీ గ్రామస్థాయిలో పర్యటించి దరఖాస్తులు స్వీకరించాలని ఉద్యమ నాయకులు కోరారు. ఉద్యమకారులందరికీ అందుబాటులో ఉండేలా గుర్తింపు ప్రక్రియను సులభతరం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం బిజ్వార్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ఉద్యమ నాయకుడు, అవార్డు గ్రహీత హెచ్. నర్సింహ, ఉద్యమ నాయకులు దోరోళ్ల కృష్ణయ్య, వాకిటి శివకుమార్, సూర్యకాంత్, చిన్న నర్సింహ, రమేష్ మాట్లాడారు.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం గ్రామగ్రామాన ప్రజలు, విద్యార్థులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఉద్యమకారులు సుదీర్ఘంగా పోరాటం చేశారని వారు గుర్తుచేశారు. ఉద్యమంలో పాల్గొన్న వారిని గుర్తించి వారి సేవలకు తగిన గౌరవం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం ప్రభుత్వం కే. కేశవరావు అధ్యక్షతన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. కమిటీ ఇప్పటికే ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియపై సంప్రదింపులు చేపడుతున్న నేపథ్యంలో గ్రామస్థాయిలోనూ దరఖాస్తుల స్వీకరణ చేపట్టాలని కోరారు.

ఉద్యమకారులందరికీ జిల్లా కేంద్రాలకు వెళ్లడం సాధ్యం కాదని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వారికి ఇబ్బందులు లేకుండా కమిటీ ప్రతినిధులు గ్రామాలకే వచ్చి దరఖాస్తులు స్వీకరించాలని వారు సూచించారు. గ్రామాల్లో పర్యటించడం సాధ్యం కాని పరిస్థితుల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించే అవకాశం కల్పించాలని కోరారు. కమిటీ నిజమైన ఉద్యమకారులను పారదర్శకంగా గుర్తించి వారికి తగిన గౌరవం, సంక్షేమ ప్రయోజనాలు అందేలా ప్రభుత్వానికి సిఫార్సులు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే గుర్తింపు ప్రక్రియలో భాగంగా పలు వర్గాలతో కమిటీ సంప్రదింపులు జరుపుతోందని తెలిపారు.

తెలంగాణ ఉద్యమకారులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు మంజూరు చేసి నెలకు రూ.20 వేల పింఛన్ అందించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాలు కేటాయించాలని కోరారు.

తెలంగాణ అమరవీరుల కుటుంబాలను ఆదుకోవడంతో పాటు ప్రతి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారుల సేవలు, త్యాగాలను అధికారికంగా గుర్తించి భావితరాలకు వారి చరిత్రను అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కే. కేశవరావు కమిటీ నిజమైన ఉద్యమకారులకు అన్యాయం జరగకుండా గుర్తింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తామని ఇప్పటికే స్పష్టం చేసిన నేపథ్యంలో, గ్రామస్థాయిలోనూ విస్తృతంగా దరఖాస్తులు స్వీకరించాలని వారు కోరారు.

# బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

## –నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



కరీంనగర్, ఆగష్టు 8: గొల్లపల్లి మండలం గుంజపడుగు గ్రామంలో వివాహితపై జరిగిన ఘటనను మాల సంఘం నాయకులు తీవ్రంగా ఖండించారు. బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని, వారికి ఎలాంటి భయాందోళనలు కలగకుండా ధైర్యం కల్పిస్తామని తెలిపారు.


గ్రామానికి చెందిన వివాహిత ఇంట్లోకి అదే గ్రామానికి చెందిన రంగు చందు అనే యువకుడు నాలుగు రోజుల క్రితం చొరబడి ఆమెను ఇబ్బందులకు గురిచేసి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు నాయకులు తెలిపారు. ఈ ఘటనపై ఇప్పటికే పోలీసులు కేసు నమోదు చేసిన నేపథ్యంలో దర్యాప్తును వేగవంతం చేయాలని కోరారు.

బాధిత కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని మాల సంఘం నాయకులు స్పష్టం చేశారు. అరాచకాలకు వ్యతిరేకంగా గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ఐక్యంగా పోరాటం చేస్తామని తెలిపారు.

బాధితురాలికి న్యాయం జరిగే వరకు ఆమె కుటుంబానికి అండగా నిలుస్తామని పేర్కొన్నారు.

నిందితుడిని చట్టప్రకారం వెంటనే అరెస్టు చేసి, కేసు దర్యాప్తును వేగవంతం చేయాలని పోలీసు ఉన్నతాధికారులను కోరారు. బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులకు అవసరమైన రక్షణ కల్పించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఈసీ సభ్యుడు, జిల్లా మాల సంఘం నాయకుడు నల్ల శ్యాం, మాల సంఘాల మండల జేఏసీ కన్వీనర్ కడారి రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు జనుప వెంకటేష్, మండల అధ్యక్షుడు పొనగంటి రాజారత్నం, మాజీ అధ్యక్షుడు మ్యాధరి రమేష్, మండల ఉపాధ్యక్షుడు భూపతి, సలహాదారులు జనుప లచ్చన్న, గ్రామ మాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుశాఖ
మద్రాసు విశ్వవిద్యాలయం
మెరీనా ఆవరణ, చెన్నై - 600 005
&
జనని
(సాంఘిక సాంస్కృతిక సమితి), చెన్నై - 118
సంయుక్త నిర్వహణలో
శంకరంబాడి సుందరాచారి జయంతి సందర్భంగా
ప్రత్యేక సాహితీ ఉపన్యాసాలు

'మా తెలుగు తల్లికి మల్లెపూదండ'
శంకరంబాడి సుందరాచారి సాహితీ వైభవం
తేది 10.08.2026, సోమవారం, ఉదయం 10.30 గం॥లకు
వేదిక : రజతోత్సవ ప్రాంగణం, మెరీనా ఆవరణ, చెన్నై - 600 005.
స్వాగతం : డా॥ పాండురంగం కాళియప్ప
ప్రార్థన : శ్రీమతి అరుణాశ్రీనాథ్
అధ్యక్షులు : ఆచార్య విస్తాలి శంకరరావు, తెలుగుశాఖాధ్యక్షులు, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై.
ముఖ్య అతిథి : శ్రీ కాకుటూరు అనిల్‌కుమార్ రెడ్డి, అధ్యక్షులు, అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ, చెన్నై.
విశిష్ట అతిథి : డా. నిర్మలా పళనివేలు, అధ్యక్షులు, జనని, చెన్నై.
ఆత్మీయ అతిథి : శ్రీ గుడిమెట్ల చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి, జనని, చెన్నై.
ఉపన్యాసకులు : ఆచార్య ఎల్.బి. శంకరరావు, విశ్రాంతాచార్యులు, రాజధాని కళాశాల, చెన్నై.
వందన సమర్పణ : డా॥ మాదా శంకరబాబు
ఉదయం 11.45 గం॥లకు
టంగుటూరి సూర్యకుమారి పాడిన పాట వీడియో ప్రదర్శన
మా తెలుగు తల్లికి మల్లెపూదండ గేయం సినీ సన్నివేశాల ప్రదర్శన

# నూతన అంతర్జాతీయ భాగస్వామ్యాలు, సహకార ఒప్పందాలతో ముగిసిన బ్రిక్స్ వేవ్స్ బజార్ 2026

న్యూఢిల్లీ, ఆగష్టు 8: సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎఫ్‌డీసీ) ముంబయిలో నిర్వహించిన బ్రిక్స్ వేవ్స్ బజార్ – 2026 రెండు రోజులపాటు ఉన్నతస్థాయి పరిశ్రమల స్థాయి చర్చలు, వ్యాపార అనుసంధానం, అంతర్జాతీయ భాగస్వామ్య కార్యక్రమాలతో విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో బ్రిక్స్ సభ్య, భాగస్వామ్య దేశాలకు చెందిన 20 దేశాల ప్రతినిధులు పాల్గొని సృజనాత్మక రంగంలో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేశారు.

బ్రిక్స్ వేవ్స్ బజార్ – 2026 లో 900 మందికి పైగా పరిశ్రమ రంగ ప్రతినిధులు పాల్గొన్నారు. నిర్మాతలు, స్టూడియోలు, ప్రసార సంస్థలు, ఫిల్మ్ కమిషన్లు, ఏవీజీసీ (యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్) రంగ ప్రతినిధులు, ప్రభుత్వ ప్రతినిధులు, పెట్టుబడిదారులు, సాంకేతిక సంస్థలు, సృజనాత్మక సంస్థల మధ్య 275కు పైగా ఎంపిక చేసిన బిజినెస్ – టు – బిజినెస్ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాలు, చర్చలు బ్రిక్స్ సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాల మధ్య కొత్త సహ నిర్మాణాలు, వ్యాపార భాగస్వామ్యాలు, సంస్థాగత సహకారాలు, దీర్ఘకాలిక సృజనాత్మక పరస్పర మార్పిడికి బలమైన పునాదులు వేశాయి.

బ్రిక్స్ వేవ్స్ బజార్ ఫలితాల గురించి నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎఫ్‌డీసీ) మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశ్ మగ్దూమ్ మాట్లాడుతూ "బ్రిక్స్ సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాల మధ్య సృజనాత్మక సహకారానికి గల అపార అవకాశాలను బ్రిక్స్ వేవ్స్ బజార్ చాటిచెప్పింది. ఇక్కడ ప్రారంభమైన భాగస్వామ్యాలు, చర్చలు మరింత బలమైన సహ నిర్మాణాలు, వ్యాపార సహకారాలు, సృజనాత్మక పరస్పర మార్పిడికి నాంది పలికాయి. ప్రపంచ సృజనాత్మక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే శాశ్వత వారధులను నిర్మించేందుకు వేవ్స్ వేదిక ద్వారా భారత్ తన నిబద్ధతను కొనసాగిస్తుంది" అని తెలిపారు.

బ్రిక్స్ వేవ్స్ బజార్ అనేక కీలకమైన అంతర్జాతీయ భాగస్వామ్యాలకు వేదికగా నిలిచింది. ఇవి బిజినెస్ – టు – బిజినెస్ ఒప్పందాలు, అంగీకార లేఖలు (ఎల్ఓఐ), అవగాహనా ఒప్పందాలు, సరిహద్దుల వెలుపల వ్యాపార ప్రకటనల రూపంలో జరిగాయి. వాటిలో ముఖ్యమైనవి

ఎన్ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశ్ మగ్దూమ్, బ్రెజిల్‌కు చెందిన రియో ఫిల్మ్ కమిషన్ అధిపతి డేనియల్ సెల్లీ మధ్య అంగీకార లేఖ (లెటర్ ఆఫ్ ఇంటెంట్ – ఎల్ఓఐ) మార్పిడి జరిగింది. ఈ ఒప్పందం ద్వారా ఎన్ఎఫ్‌డీసీ?రియోఫిల్మే మధ్య ఆడియో, విజువల్ రంగంలో సహకారాన్ని బలోపేతం చేయడంతో పాటు, వేవ్స్ – 2027లో బ్రెజిల్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించనున్నారు. ఈ చర్య భారత్, బ్రెజిల్ మధ్య సృజనాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయనుంది.

బ్రిక్స్ వేవ్స్ బజార్ – 2026 సందర్భంగా ఎన్ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశ్ మగ్దూమ్, బ్రెజిల్‌కు చెందిన రియో ఫిల్మ్ కమిషన్ అధిపతి డేనియల్ సెల్లీ ఇరు సంస్థల మధ్య ఆడియో, విజువల్ రంగంలో సహకారాన్ని బలోపేతం చేసేందుకు లెటర్ ఆఫ్ ఇంటెంట్ ను మార్చుకున్న చిత్రం

ఎన్ఎఫ్‌డీసీ – ఎన్ఎఫ్ఏఐ రష్యాకు చెందిన గోస్‌ఫిల్మోఫోండ్‌తో కొనసాగుతున్న తమ సహకారాన్ని ప్రకటించాయి. ఎఫ్ఐఏఎఫ్ సభ్యత్వం కలిగిన ఈ రెండు ఫిల్మ్ ఆర్కైవ్ సంస్థలు చలనచిత్రాలను భద్రపరిచే రంగంలో పరస్పర సహకారాన్ని మరింత అధికారికంగా బలోపేతం చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించాయి.

దక్షిణాఫ్రికా, రష్యా, థాయ్‌లాండ్, కజకిస్థాన్ దేశాల పరిశ్రమ ప్రతినిధులు గ్లోబల్ సౌత్ ఫిల్మ్ ఫెస్టివల్ – 2027 నిర్వహణ ప్రతిపాదనను ప్రకటించారు. అభివృద్ధి చెందుతున్న సృజనాత్మక ఆర్థిక వ్యవస్థల మధ్య సాంస్కృతిక, సినీ రంగ సహకారాన్ని మరింత బలోపేతం చేయడం ఈ ఉత్సవం ప్రధాన లక్ష్యమని తెలిపారు.

మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎంఈఏఐ), వియత్నాంకు చెందిన సంస్కృతి, క్రీడలు, పర్యాటక మంత్రిత్వశాఖ సినీ విభాగం చలనచిత్ర రంగంలో సహకారాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, అధికారిక ద్వైపాక్షిక ఒప్పందం కుదుర్చుకునే దిశగా ముందుకు సాగేందుకు రికార్డ్ ఆఫ్ మీటింగ్ ను ప్రకటించాయి.

పరిశ్రమల భాగస్వామ్యాలు, కంటెంట్ సృష్టి, విద్యా కార్యక్రమాలు, ఆవిష్కరణలు, వాణిజ్యీకరణ (మానిటైజేషన్), ప్రతిభాభివృద్ధి వంటి రంగాల్లో పరస్పర సహకారం కోసం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్ (ఐఐసీటీ), గ్రాఫిటీ మల్టీమీడియా ప్రైవేట్ లిమిటెడ్ ఒక అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి.

బ్రెజిల్‌కు చెందిన మీడియా వేదిక – ది సౌత్ గ్లోబల్ న్యూస్ – బ్రిక్స్ దేశాలతో పాటు విస్తృత గ్లోబల్ సౌత్ దేశాల మధ్య సమాచార ప్రసారం, మీడియా సహకారం, సాంస్కృతిక పరస్పర మార్పిడిని బలోపేతం చేసే కొత్త కార్యక్రమాన్ని ప్రకటించింది.

భారత్, పోర్చుగల్ ఉమ్మడి నిర్మాణంలో రూపొందనున్న ఫీచర్ ఫిల్మ్ 'పోర్చుగీస్ మ్యాన్ – ఓ వార్' ను ప్రకటించారు. ఈ చిత్ర నిర్మాణంలో భారత్, బ్రెజిల్, పోర్చుగల్, ఫ్రాన్స్ దేశాలకు చెందిన భాగస్వాములు, సహ నిర్మాతలు కలిసి పనిచేయనున్నారు.

కార్టినా ఎంటర్‌టైన్‌మెంట్, వేగా ఫిల్మ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న భారత్ –రష్యా సహ నిర్మాణ చిత్రం 'కొరోవా'ను అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఇరు దేశాల మధ్య సృజనాత్మక సహకారం మరింత బలోపేతం కానుంది.

చెక్ రిపబ్లిక్‌కు చెందిన మూవీ ఎస్.ఆర్.ఓ. నిర్మాణ సంస్థ, భారత్‌కు చెందిన సినిమా4గుడ్ కలిసి టోమాస్ బాటా జీవితంపై అంతర్జాతీయ చారిత్రక ఇతిహాస చిత్రాన్ని రూపొందించనున్నట్లు ప్రకటించాయి. ఈ ప్రాజెక్టులో భారత్, చెక్ రిపబ్లిక్, చైనా, దక్షిణాఫ్రికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) దేశాలకు చెందిన భాగస్వాములు కలిసి పనిచేయనున్నారు.

భారత్‌లో కాలివిజన్ ఏఐ స్టూడియో ప్రారంభిస్తున్నట్లు దక్షిణ కొరియాకు చెందిన ఎన్ కోర్ ఐఎన్సీ, యూఏఈకి చెందిన విజన్ ఎక్స్ సంస్థలు ప్రకటించాయి. సినిమా, కథనాల రూపకల్పన కోసం కృత్రిమ మేధ ఆధారిత కంటెంట్ నిర్మాణ స్టూడియోగా ఇది పనిచేయనుంది.

పరిశ్రమ ప్రముఖులు బ్రిక్స్ ఇండిపెండెంట్ ప్రొడ్యూసర్స్ అలయన్స్ (బీఐపీఏ) ను ఆవిష్కరించారు. సహకారం, పెట్టుబడులు, విద్య, ఆవిష్కరణల ద్వారా బ్రిక్స్ దేశాల నిర్మాతలను అనుసంధానించే శాశ్వత అంతర్జాతీయ వేదికగా దీనిని రూపొందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

కొత్త ప్రీమియం మైక్రో డ్రామా వేదిక – క్లిప్ – తన సృజనాత్మక దృక్పథంతో పాటు త్వరలో విడుదల చేయనున్న ప్రాజెక్టుల వివరాలను అధికారికంగా ప్రకటించింది. ఈటీవీ టెలివిజన్ ప్రసారం కోసం రూపొందిస్తున్న తన కొత్త భారతీయ అనిమే సిరీస్ పోస్టర్‌ను ఆవిష్కరించింది.

గేమ్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (జీడీఏఐ), మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఇండియన్ కామిక్స్ అసోసియేషన్ లతో అస్సాం ఏవీజీసీ – ఎక్స్ఆర్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ వ్యూహాత్మక అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. వీటి ద్వారా గేమ్ అభివృద్ధి, కామిక్స్ రంగం, అంతర్జాతీయ మార్కెట్ లభ్యత, మేధోసంపత్తి పంపిణీ వంటి అంశాలను మరింత బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

వైభవి స్టూడియోస్ తమ రాబోయే అనిమే ఫీచర్ ఫిల్మ్ 'టియెరా'ను అధికారికంగా ప్రకటించింది.

ఇండియన్ కామిక్స్ అసోసియేషన్, మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కలసి అంతర్జాతీయ సహకారం, ప్రతినిధి బృందాల పరస్పర మార్పిడి, అంతర్జాతీయ మార్కెట్ లభ్యత, మేధోసంపత్తి పంపిణీని ప్రోత్సహించేందుకు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి.

విజయవంతంగా ముగిసిన బ్రిక్స్ వేవ్స్ బజార్ – 2026 బ్రిక్స్ దేశాల మధ్య సృజనాత్మక ఆర్థిక సహకారాన్ని బలోపేతం చేసే మరో కీలక ఘట్టంగా నిలిచింది. ప్రభుత్వాలను, పరిశ్రమల ప్రముఖులను, సృజనకారులను, పెట్టుబడిదారులను, వివిధ సంస్థలను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా సుస్థిర అంతర్జాతీయ భాగస్వామ్యాలను ప్రోత్సహించాలన్న భారత్ నిబద్ధతను ఈ బజార్ మరోసారి చాటిచెప్పింది. సాంస్కృతిక దౌత్యం, ఆర్థికాభివృద్ధికి సృజనాత్మక పరిశ్రమలను ప్రధాన చోదకంగా తీర్చిదిద్దే దిశగా భారత్ కట్టుబడి ఉందని ఈ కార్యక్రమం స్పష్టం చేసింది.

సృజనాత్మక పరిశ్రమల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఒక వేదికగా ఈ రెండు రోజుల కార్యక్రమం కొత్త భాగస్వామ్యాలను ఏర్పరచుకోవడానికి, సహ నిర్మాణ అవకాశాలను పరిశీలించడానికి, విజ్ఞానాన్ని మార్పిడి చేసుకోవడానికి బ్రిక్స్ దేశాల వ్యాప్తంగా సాంస్కృతిక, సృజనాత్మక సహకారాన్ని బలోపేతం చేయడానికి చలనచిత్ర, టెలివిజన్, ఏవీజీసీ- ఎక్స్ఆర్ గేమింగ్, యానిమేషన్, మీడియా, డిజిటల్ కంటెంట్ రంగానికి చెందిన ప్రముఖులకు ఒక మార్గదర్శకంగా నిలిచింది.

# ప్రమాదకర ప్రాంతాల్లో కొత్త కమ్యూనిటీ రేడియో కేంద్రాల ఏర్పాటు కోసం ప్రధాన కార్యదర్శులు, విపత్తు నిర్వహణ శాఖలకు సూచన

న్యూఢిల్లీ, ఆగష్టు 8:దేశంలో కమ్యూనిటీ రేడియో స్టేషన్ల (సీఆర్ఎస్) ఏర్పాటుకు సంబంధించిన పాలసీ మార్గదర్శకాల ప్రకారం, ఆయా స్టేషన్ల పరిధిలో నివసించే స్థానిక ప్రజల అవసరాలకు సేవ చేయడమే కమ్యూనిటీ రేడియో ప్రసారాల ప్రాథమిక లక్ష్యం.

ఈ మార్గదర్శకాల ప్రకారం ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర పరిస్థితులు, ప్రజా ప్రయోజనాలు లేదా వాటికి సమానమైన క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడు, అవసరమైన ఏవైనా ప్రత్యేక సందేశాలను ప్రసారం చేయాల్సిందిగా కమ్యూనిటీ రేడియో స్టేషన్లను ఆదేశించే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. ఇటువంటి ప్రభుత్వ ఆదేశాలను ఖచ్చితంగా పాటించాల్సిన బాధ్యత సదరు రేడియో అనుమతి కలిగి ఉన్న సంస్థలపై ఉంటుంది.

ఈ విధాన మార్గదర్శకాలు కమ్యూనిటీ రేడియో స్టేషన్లకు మరో కీలకమైన సదుపాయాన్ని కల్పిస్తున్నాయి. స్థానిక పరిపాలనా యంత్రాంగం అందించే పౌర సౌకర్యాలు, ప్రకృతి వైపరీత్యాలు, ఆరోగ్య హెచ్చరికలు, ఇతర ముఖ్యమైన సమాచారానికి సంబంధించిన ప్రజా ప్రకటనలను ప్రసారం చేయడానికి వీటికి అనుమతి ఉంది.

కృతి వైపరీత్యాలు, ఇతర అత్యవసర సమయాల్లో స్థానిక భాషల్లోనే, సకాలంలో, నమ్మకమైన సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో కమ్యూనిటీ రేడియో స్టేషన్లు (సీఆర్ఎస్‌లు) అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తున్నాయి.

స్థానిక ప్రజల సమాచార అవసరాలను తీర్చడంలో, ముఖ్యంగా వరదలు వచ్చే ప్రాంతాలు, తీరప్రాంతాలు. ఇతర విపత్తు ముప్పు ఉన్న ప్రాంతాలలో కమ్యూనిటీ రేడియో స్టేషన్లు ఎంతో ఉపయోగపడుతున్నాయని నిరూపితమైంది. ఈ నేపథ్యంలో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్య కార్యదర్శులకు, అలాగే రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖల పరిపాలనా కార్యదర్శులకు కీలక లేఖలు రాసింది. విపత్తులకు సంబంధించిన సమాచారాన్ని ప్రజల్లోకి వేగంగా తీసుకెళ్లడానికి ఈ సమర్థవంతమైన మాధ్యమాన్ని ఉపయోగించుకోవాలని అందులో కోరింది. విపత్తు ముప్పు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, అక్కడ కొత్త కమ్యూనిటీ రేడియో స్టేషన్ల ఏర్పాటును ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది.

దేశంలో కమ్యూనిటీ రేడియో ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక మద్దతు అందిస్తోంది. ఇందులో భాగంగా భారత్‌లో కమ్యూనిటీ రేడియో ఉద్యమానికి మద్దతు అనే కేంద్ర రంగ పథకాన్ని 2026-27 నుంచి 2030-31 కాలానికి గానూ కొనసాగించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ పథకం కోసం రూ. 50 కోట్లను కేటాయించారు. కొత్తగా ఏర్పాటయ్యే, ప్రస్తుతం నడుస్తున్న కమ్యూనిటీ రేడియో స్టేషన్లను ఆర్థికంగా బలోపేతం చేయడమే ఈ పథకం లక్ష్యం. రేడియో స్టేషన్ల స్థాపనకు, నిర్వహణకు అవసరమైన పరికరాల కొనుగోలు లేదా పాత పరికరాల మార్పిడి కోసం ఈ నిధుల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తారు. విపత్తులు లేదా అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు కూడా రేడియో ప్రసారాలు నిరంతరాయంగా సాగేలా చూడటం కోసం యూపీఎస్, జనరేటర్ సెట్లు, సౌర విద్యుత్ వ్యవస్థలు వంటి బ్యాకప్ విద్యుత పరికరాల కొనుగోలుకు కూడా ఈ పథకం కింద ఆర్థిక సాయం అందజేస్తారు.

# చేనేత ఉత్పత్తులను ఆదరించాలని పౌరులకు కేంద్రమంత్రి శ్రీమతి అన్నపూర్ణా దేవీ పిలుపు

న్యూఢిల్లీ, ఆగష్టు 8:జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా దేశంలోని చేనేత ఉత్పత్తులను ప్రతి ఒక్కరూ ఆదరించాలని, దేశీయ నేతన్నలు, చేతివృత్తి కళాకారులను గౌరవించాలని కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి అన్న పూర్ణా దేవి పౌరులను కోరారు.సామాజిక మాధ్య మం ఎక్స్ వేదికగా ఆమె ఒక సందేశాన్ని పంచుకుంటూ... భారతదేశ చేనేత అనేది కేవలం ఒక వస్త్రం మాత్రమే కాదని, అది మన సంస్కృతి, సంప్రదాయాలకు, లక్షలాది మంది చేనేత కుటుంబాల జీవనోపాధికి బలమైన పునాది అని కొనియాడారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పిలుపునకు అందరూ స్పందించాలని కేంద్ర మంత్రి కోరారు. తమకు ఇష్టమైన చేనేత ఉత్పత్తులతో వీడియోలను రూపొందించి సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడం ద్వారా ఈ జాతీయ చేనేత దినోత్సవాన్ని మరింత పెద్ద ప్రజా ఉద్యమంగా మార్చాలని విజ్ఞప్తి చేశారు.ఈ ప్రత్యేక రోజున మనమంతా 'వోకల్ ఫర్ లోకల్' (స్థానిక ఉత్పత్తులకే ప్రాధాన్యత) అనే సంకల్పాన్ని మరింత బలోపేతం చేయాలని, భారతీయ చేనేత వస్తువులను అంగీకరిస్తూ మన కళాకారుల ఆత్మగౌరవాన్ని, ప్రతిష్టను మరింత పెంచాలని ఆమె పిలుపునిచ్చారు.

# దుర్గమ్మ జాతరల్లో జగ్గారెడ్డి సందడి..



సంగారెడ్డి, ఆగష్టు 8: (నేటినిజం ప్రతినిధి ):ఆషాఢమాసం సందర్భంగా సదాశివపేట, సంగారెడ్డి పట్టణాల్లో నిర్వహించిన దుర్గమ్మ తల్లి జాతర మహోత్సవాల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. సదాశివపేటలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన హారతి సమర్పించారు. అనంతరం పోతరాజులు, భక్తులతో కలిసి ఉత్సాహంగా చిందులు వేస్తూ జాతరలో సందడి చేశారు.

జాతరకు భారీగా తరలివచ్చిన భక్తులతో మమేకమై వలువురితో ఆప్యాయంగా మాట్లాడారు. జగ్గారెడ్డితో కరచాలనం చేసేందుకు, సెల్ఫీలు దిగేందుకు భక్తులు పోటీపడ్డారు. అనంతరం సంగారెడ్డి పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో జరుగుతున్న దుర్గమ్మ తల్లి జాతర ఉత్సవాల్లో జగ్గారెడ్డి తన సతీమణి నిర్మలతో పాటు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివసత్తుల రంగాన్ని ఆలకించిన అనంతరం జాతర సంప్రదాయ క్రతువులను దగ్గరుండి నిర్వహింపజేశారు. పోతరాజులతో కలిసి నృత్యం చేస్తూ భక్తుల ఉత్సాహంలో భాగస్వాములయ్యారు.

ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ? ఆషాఢమాసంలో దుర్గమ్మ తల్లి జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించడం ఆనవాయితీగా కొనసాగుతోందన్నారు. ప్రజలు తమ మొక్కులు తీర్చుకుని అమ్మవారి ఆశీస్సులు పొందేందుకు పెద్దఎత్తున జాతరకు తరలివస్తున్నారని పేర్కొన్నారు. అమ్మవారి కృపతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ నెల 9న నిర్వహించనున్న బోనాల మహోత్సవాన్ని కూడా ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

# సుమారు 350 నుంచి దాదాపు 2.4 లక్షల సంస్థలకు విస్తరించిన భారత స్టార్టప్ వ్యవస్థ : శ్రీ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, ఆగష్టు 8:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించిన జన్ ధన్ యోజన వంటి కార్యక్రమాల ఫలితంగా ఆర్థిక సమ్మిళితం సాధనలో భారత్ గణనీయమైన పురోగతి సాధించిందని సైన్స్, టెక్నాలజీ, భూవిజ్ఞాన శాఖ స్వతంత్ర హోదా, ప్రధానమంత్రి కార్యాలయం, అణుశక్తి, అంతరిక్ష , సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ఇప్పుడు దేశం ఆర్థిక సమ్మిళితం నుంచి ఆర్థిక సాధికారత వైపు దృఢంగా ముందుకు సాగాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అన్నారు.

దేశంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల ఆధారంగా మేధోసంపన్నమైన, సురక్షితమైన, విశ్వసనీయమైన ఆర్థిక వ్యవస్థను నిర్మించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. కృత్రిమ మేధ, క్వాంటం సాంకేతికతలు, సైబర్ భద్రత, బ్లాక్‌చెయిన్, విశ్వసనీయ డిజిటల్ ఆవిష్కరణలు వంటి ఆధునిక సాంకేతికతలే భారత ఫిన్‌టెక్ రంగం తదుపరి వృద్ధి దశను నిర్దేశిస్తాయని ఆయన అన్నారు.న్యూఢిల్లీలో జరిగిన మూడో ఇండియా ఇంటర్నేషనల్ ఫిన్‌టెక్ ఫెస్టివల్‌లో డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రసంగిస్తూ, బ్యాంకింగ్ రంగం, ఆర్థిక సంస్థలు, సాంకేతిక సంస్థలు, స్టార్టప్‌ల మధ్య సన్నిహిత సహకారంతో భారత ఫిన్‌టెక్ రంగం దేశ ఆర్థిక మార్పునకు కీలక చోదకశక్తిగా అవతరించిందని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యాల మద్దతుతో కొనసాగుతున్న ఈ సహకార విధానమే వేగంగా విస్తరిస్తున్న భారత ఆవిష్కరణల వ్యవస్థకు బలమైన పునాదిగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు.

ఆర్థిక సేవల భవిష్యత్తును నిర్దేశించడంలో అత్యాధునిక సాంకేతికతల పాత్ర అత్యంత కీలకమని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. తదుపరి తరం ఫిన్‌టెక్ పరిష్కారాలు కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్, సైబర్ భద్రత, క్వాంటం సాంకేతికతలు, బ్లాక్‌చెయిన్ వంటి రంగాలపై మరింత దృష్టి సారించాలని ఆయన సూచించారు. సురక్షితమైన, స్థిరమైన, పౌర కేంద్రిత ఆర్థిక సేవలను అందించగల బాధ్యతాయుత కృత్రిమ మేధ, విశ్వసనీయ ఆవిష్కరణలే భవిష్యత్తును శాసిస్తాయని ఆయన స్పష్టం చేశారు.

భారత్ సాధిస్తున్న సాంకేతిక పురోగతిని ప్రస్తావిస్తూ, జాతీయ క్వాంటం మిషన్ ద్వారా క్వాంటం కంప్యూటింగ్, క్వాంటం కమ్యూనికేషన్, క్వాంటం సెన్సింగ్, క్వాంటం మెటీరియల్స్ మొదలైన నాలుగు కీలక రంగాల్లో పెట్టుబడులు పెడుతున్న ప్రపంచంలోని కొద్ది దేశాల జాబితాలో భారత్ ఒకటిగా నిలిచిందని శ్రీ జితేంద్ర సింగ్ తెలిపారు. జాతీయ క్వాంటం మిషన్ కింద పదేళ్లలో 2,000 కిలోమీటర్ల సురక్షిత క్వాంటం కమ్యూనికేషన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించినప్పటికీ, కేవలం మూడు సంవత్సరాల్లోనే భారత్ 1,000 కిలోమీటర్లకు పైగా సురక్షిత క్వాంటం కమ్యూనికేషన్ వ్యవస్థను సాధించి, నిర్దేశిత గడువు కంటే ఎంతో ముందుగానే గణనీయమైన పురోగతిని సాధించిందని ఆయన తెలిపారు. దేశంలో అభివృద్ధి చెందుతున్న అత్యాధునిక సాంకేతిక పర్యావరణ వ్యవస్థకు ఊతమిస్తున్న మరో కీలక కార్యక్రమంగా ఇండియాఏఐ మిషన్ ను ఆయన ప్రస్తావించారు.

ప్రపంచంలో చోటుచేసుకుంటున్న సాంకేతిక పరిణామాలకు భారత్ ఇకపై ఏళ్ల తర్వాత స్పందించే దేశంగా ఉండబోదని, వాటితో సమానంగా అడుగులు వేస్తోందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. అంతరిక్ష రంగంతో పాటు అణుశక్తి రంగాన్ని కూడా ఇటీవల ప్రైవేట్ భాగస్వామ్యానికి తెరవడం ద్వారా ప్రభుత్వం అవలంబిస్తున్న సహకార విధానం ఆవిష్కరణలకు మరింత వేగం తీసుకువస్తూ, సాంకేతికత ఆధారిత ఆర్థిక వృద్ధికి కొత్త అవకాశాలను సృష్టిస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం సుమారు 9 బిలియన్ అమెరికన్ డాలర్ల విలువ కలిగిన భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ ఈ దశాబ్దం ముగిసేలోపు 45 బిలియన్ డాలర్లకు చేరుకునే అవకాశముందని ఆయన తెలిపారు. పరిశ్రమల భాగస్వామ్యంతో అమలవుతున్న విధాన సంస్కరణలు ఎంతటి ఫలితాలను అందించగలవో దీనిద్వారా స్పష్టమవుతోందని ఆయన అన్నారు.


భారత ఫిన్‌టెక్ రంగం తదుపరి వృద్ధి దశకు సిద్ధమవ్వాలంటే కృత్రిమ మేధ ఆధారిత ఆర్థిక సేవలు, సురక్షిత నిరంతర బ్యాంకింగ్, అధునాతన మోసాల నివారణ వ్యవస్థలు, సరిహద్దుల వెలుపల డిజిటల్ చెల్లింపులు, అందుబాటు ధరలో ఆర్థిక పరిష్కారాల అభివృద్ధిపై దృష్టి సారించాలని శ్రీ జితేంద్ర సింగ్ ఉద్ఘాటించారు. ఈ అభివృద్ధి చెందుతున్న రంగాలు భారత ఫిన్‌టెక్ సంస్థలు ప్రపంచ స్థాయిలో అగ్రగాములుగా ఎదగడానికి విస్తృత అవకాశాలను కల్పిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.


భారత్‌లో ఆవిష్కరణల వ్యవస్థను ప్రస్తావిస్తూ, గత దశాబ్దంలో దేశంలో స్టార్టప్‌ల సంఖ్య సుమారు 350 నుంచి దాదాపు 2.4 లక్షలకు పెరిగిందని శ్రీ జితేంద్ర సింగ్ తెలిపారు. ప్రపంచ ప్రమాణాలకు తగిన మానవ వనరుల సామర్థ్యం, అనుకూల విధానాల వాతావరణం ఈ వృద్ధికి బలమైన పునాదిగా నిలిచాయని ఆయన పేర్కొన్నారు. ఈ పురోగతిని మరింత ముందుకు తీసుకెళాలంటే స్టార్టప్‌లు, నియంత్రణ సంస్థలు, విద్యా సంస్థలు, ఆర్థిక సంస్థలు, పరిశ్రమలు, సాంకేతిక సంస్థల మధ్య మరింత బలమైన భాగస్వామ్యం అవసరమని ఆయన ఉద్ఘాటించారు. అలాంటి సమన్వయంతోనే ప్రపంచ స్థాయిలో పోటీపడగల అత్యాధునిక ఆర్థిక సాంకేతికతలను అభివృద్ధి చేయడం సాధ్యమవుతుందని ఆయన అన్నారు.


దేశంలో ఆర్థిక సేవలను ప్రజలకు మరింత చేరువ చేసే లక్ష్యంతో అమలు చేసిన కార్యక్రమాల విజయమే భారత తదుపరి అభివృద్ధి దశకు బలమైన పునాదిగా నిలిచిందని కేంద్ర మంత్రి అన్నారు. డిజిటల్ ఇండియా కార్యక్రమం ద్వారా డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచ అగ్రగామిగా ఎదిగిన భారత్ ఇకపై డిజిటల్ చెల్లింపుల నుంచి డిజిటల్ సౌభాగ్యం దిశగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. సాంకేతికత ఆధారిత ఆర్థిక వ్యవస్థలు దేశ ఆర్థిక వృద్ధికి, ప్రజల జీవనోపాధి మెరుగుదలకు నేరుగా దోహదపడేలా రూపుదిద్దుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

వేగంగా మారుతున్న సాంకేతిక పరిణామాల నేపథ్యంలో నిరంతర ఆవిష్కరణలు, కాలానుగుణంగా మార్పులను స్వీకరించడం అత్యవసరమని డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. పారిశ్రామిక రంగంలో తదుపరి మార్పును ప్రస్తావిస్తూ, భవిష్యత్ పారిశ్రామిక విప్లవానికి కృత్రిమ మేధ ప్రధాన చోదకశక్తిగా నిలుస్తుందని, అదే సమయంలో ఆరోగ్య సంరక్షణ, ఆహార భద్రత, సుస్థిర అభివృద్ధి వంటి కీలక సవాళ్ల పరిష్కారంలో విప్లవాత్మక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు. జీనోమ్ ఇండియా కార్యక్రమం కింద ఇప్పటికే పది వేల మంది వ్యక్తుల జన్యు క్రమ విశ్లేషణ (జీనోమ్ సీక్వెన్సింగ్) ను విజయవంతంగా పూర్తి చేయడాన్ని ప్రస్తావిస్తూ, అత్యాధునిక విజ్ఞానశాస్త్రం, సాంకేతిక రంగాల్లో భారత్ సాధిస్తున్న పురోగతికి ఇది నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

శాస్త్రీయ ప్రతిభ, సాంకేతిక నాయకత్వం, సహకార భాగస్వామ్యాల సమన్వయంతో ప్రపంచంలోనే విశ్వసనీయ ఆవిష్కరణల ఆర్థిక వ్యవస్థగా ఎదిగే అపూర్వ అవకాశం భారత్‌కు ఉందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. అత్యాధునిక సాంకేతికతలు, ఆవిష్కరణలు, ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యాలపై నిరంతర పెట్టుబడులు కొనసాగితే, ప్రపంచ సాంకేతిక పురోగతికి భారత్ గణనీయమైన తోడ్పాటు అందించడంతో పాటు తన సొంత ఆర్థిక మార్పును కూడా మరింత వేగవంతం చేయగలదని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.






You are Cordially invited to the
Book Releasing function of

"KOMARAM BHEEM", "THE BOND", "BANDHAM"
Novels by: Sri S.M. Pran Rao

On 13th August, 2026 at 4:00 pm

Venue: Bhagawan Mahaveer Auditorium,
State Museum, Public Gardens, Hydeerhad

President:
Prof. R. Sayanna
Former Vice Chancellor,
Kakatiya University

Chief Guest:
Prof. Kodandaram
Hon'ble MLC

Eminent Guest:
Prof. K. Arjun Rao
Director, Dept. of Heritage Telangana
(Formerly Archaeology & Museums)

Guests of Honor:
Prof. Pruthviraj, Former Registrar, Dr. BRAOU, Hyd
Sri Allani Sridhar, Popular Cine Director
Sri Chintapatla Sudarshan, Popular Writer & Critique
Sri Koora Chidambaram, Popular Writer & Critique
Sri S.M. Pran Rao, Writer

Invited by
Naresh Kaluvakota
Convenor

The Students of Sri S.M. Pran Rao (1973-76 batch GJC, Nizamabad)

# ప్రత్యేక చట్టాలకు నోచుకోని ఆదివాసీలు

1982, ఆగస్టు 9న జెనివాలో అటవి వనరుల హక్కులకు సంబంధించిన సమస్యలపై 26 మంది స్వతంత్ర మానవ హక్కుల మేధావులతో వర్కింగ్ గ్రూప్‌ల సమావేశాన్ని జరిగింది. ఈ సమావేశంలో 140 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆదివాసీల కోసం కూడా ఒక రోజు ఉండాలని ఐక్య రాజ్య సమితిని కమిటీ కోరగా, ఆదివాసుల సంరక్షణ చట్టాలకు ఐక్యరాజ్య సమితి ఆమోదం తెలిపింది.

### మేధావుల వర్కింగ్ కమిటీ

1992 నుండి పది సంవత్సరాల పాటు ప్రపంచ వ్యాప్తంగా తిరిగి ఆదివాసీల సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేసి విశ్లేషించింది.

అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం ప్రతి సంవత్సరం ఆగస్టు 9న ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించ బడుతుంది. ఆదివాసుల హక్కుల పరిరక్షణ కోసం ఏటా ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించాలని 1994లో ప్రకటించింది. 1994 నుండి 2014 వరకు ఆ మధ్య కాలాన్ని ఆదివాసీల అభివృద్ధి కాలంగా పరిగణించి ఆగస్టు 9న అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవంగా ప్రకటించింది.

ప్రపంచ వ్యాప్తంగా ఆదివాసీలు అంతరించి పోతున్న తరుణంలో వారి సంరక్షణ దిశగా ఐక్యరాజ్య సమితి చర్యలు చేపట్టింది.

1997లో గిరిజనులకు ప్రత్యేక చట్టాలు, హక్కులను కల్పిస్తూ, ప్రపంచ దేశాల ప్రతినిధులను తీర్మానానికి ఆహ్వానించింది. 143 ఐరాస సభ్యదేశాలు ఓటింగ్‌లో పాల్గొనగా 125 దేశాల ప్రతినిధులు తీర్మానాన్ని ఆమోదించారు. 14 మంది తటస్థ వైఖరి తెలపగా, కేవలం నలుగురు వ్యతిరేకించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఈ సనాతన ప్రజలను కాపాడవలసిన బాధ్యత మనపై ఉన్నది. అందుకు ప్రతి దేశం కొత్త చట్టాలు రూపొందించడం, వాటిని అమలు చేయడం, తద్వారా జీవించే హక్కుతో సహా ఆధునిక మానవునికి గల అన్ని హక్కులూ వారికి ఇవ్వవలసి ఉన్నది' అని 1994 డిసెంబర్ 23న ఐక్కరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 49/214 తీర్మానంలో పేర్కొన్నది. అప్పటి నుంచి గిరిజన హక్కులు, వారికి ప్రభుత్వాలు కల్పిస్తున్న రాయితీల గురించి అవగాహన కల్పించేందుకు ఏటా ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.



### ఆగస్టు 9...అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం

బ్రతుకు పోరాటంలో ఆరితేరిన వారు ఆదివాసీలు. వారు నివసించే ప్రాంతాలు పుష్కలమైన సహజ వనరులతో కళకళలాడు తుండేవి. సాటి మానవులుగా అనేక దేశాలలో వారికి తగిన గుర్తింపు, రక్షణ లేదు. ఆయా దేశాలలో కనీసపు చట్టాలు కూడా లేవు.

ప్రపంచంలో సుమారు ఏడు వేల భాషలు ఉంటే అందులో ఆదివాసీ తెగలు మాట్లాడే బాషలే నాలుగు వేలు ఉన్నట్లు రికార్డులు చెపుతున్నాయి. నేడు అత్యధికులు మాట్లాడే, వాడే ఆరు భాషలు గతంలో అంతరించి పోయిన ఆదివాసీ తెగలు వాడినవే.

నాగరిక సమాజపు కొత్త పోకడలకు దూరంగా తమ కట్టు, బొట్టూ, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటు భావి తరాలకు అందిస్తున్నారు. యేడాది పొడవునా వారు జరుపుకునే పండుగలు, వేడుకల్లో వారి సంస్కృతి ప్రతిబింబిస్తుంది.

ఆదివాసీలు ఒడిషా, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, మిజోరం, అండమాన్ నికోబార్ దీవులలో ఎక్కువగా జీవిస్తున్నారు.

మన దేశంలో సుమారు 600 ఆదివాసీ తెగలు గుర్తించ బడ్డాయి. భారత రాజ్యాంగం వీరికి చట్టపరమైన రక్షణలు కల్పించింది. 1874లోనే ప్రత్యేక షెడ్యూల్డ్ జిల్లాల చట్టం చేయబడింది. 1917లో ఆదివాసీ తెగల నివాస ప్రాంతాలలో ఉమ్మడి భూమి హక్కులు ఇవ్వబడ్డాయి. ఆదివాసీ తెగలకు అటవీ భూములపై హక్కులు కల్పిస్తూ 2006లో చట్టం చేయబడింది. చట్టం ప్రకారం అటవీ భూమిపై ఆధారపడి జీవిస్తున్న ప్రతి గిరిజన కుటుంబానికీ 10 ఎకరాల వరకూ పట్టా ఇవ్వవచ్చు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు కావస్తున్నా ఆదివాసీ తెగలు తమ సంప్రదాయపు భూముల నుంచి, అటవీ ప్రాంతం నుంచి నెట్టివేయ బడుతున్నారు. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 1/70 చట్టం అమలులో ఉన్నది. గిరిజనుల సాంప్రదాయక భూములు గిరిజన తెగలకే దక్కాలి. గిరిజనేతరులకు షెడ్యూల్డ్ భూమిపై ఎట్టి హక్కూ లేదు. ఉభయ తెలుగు రాష్ట్రంలో షెడ్యూల్డ్ ప్రాంతంలో 48 శాతం సంప్రదాయక గిరిజన భూములను గిరిజనేతరులు ఆక్రమించు కున్నారు. ఆదివాసీ తెగల వాయిద్య పరికరాలు, వారి నృత్యాలు ప్రభుత్వం ప్రోత్సాహం లేక అంతరించి పోతున్నాయి. ఆదివాసీ ప్రాంతాలలోకి పర్యాటకం ప్రవేశించాక ఆదివాసీ కళలు వ్యాపార సరుకులుగా మారి పోయాయి. స్వాతంత్ర్యం వచ్చి యేళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచు కోని గిరిపల్లెలు నేటి ఉన్నాయి. విద్య, వైద్య, రవాణా విషయంలో గిరిజన గూడాలు, తాండాల్లో నేటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నడవడానికి రోడ్డు, తాగటానికి నీటి సౌకర్యం కూడా లేని పల్లెలున్నాయి. ఇప్పటికి పోడు భూముల సమస్య, అటవీ భూములకు పట్టాలు, ప్రభుత్వ అజమాయిషీ కాకుండా గ్రామసభల ద్వారా స్వయం పాలన ఉద్దేశిత పీసా చట్టం అమలు కోసం గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీ సంఘాలు పోరాటాలను కొనసాగిస్తూనే ఉన్నాయి.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

## ప్రమాద బీమా రూ.5 లక్షలు అందజేత




రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 8:(నేటినిజం ప్రతినిధి): రాచర్ల బొప్పాపూర్ గ్రామానికి చెందిన ఆటో కార్మికుడు బొమ్మనివేణి రాజు నాలుగు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. జిల్లాలోని 5 వేల మంది ఆటో కార్మికులకు ప్రమాద, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించిన నేపథ్యంలో రాజు భార్య బొమ్మనివేణి భాగ్యలక్ష్మికి రూ.5 లక్షల ప్రమాద బీమా మొత్తాన్ని అందజేశారు.జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు అల్లే శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు బొల్లి రామ్మోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ ఉమర్ ఆధ్వర్యంలో బీమా మొత్తాన్ని అందించారు. ఆటో కార్మికులకు బీమా సౌకర్యం కల్పించిన కేటీఆర్, చల్మెడ లక్ష్మీనరసింహారావులకు ఈ సందర్భంగా ఆటో కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వేములవాడకు చెందిన ఆటో కార్మికులు ఎంఏ అంజద్ పాషా, మెడిపెల్లి రాజు, ఎండీ ఖాజా, షేక్ రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీచైతన్య పాఠశాలలో బద్దిపోచమ్మ బోనాలు



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 8:(నేటినిజం ప్రతినిధి): శ్రీచైతన్య పాఠశాలలో శనివారం బద్దిపోచమ్మ బోనాల సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు అమ్మవారి, పోతురాజు వేషధారణలతో సంప్రదాయబద్ధంగా బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఏజీఎం ముద్రకోల రాజు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు సంప్రదాయాలు, సంస్కృతిపై అవగాహన పెరుగుతుందని అన్నారు. విద్యార్థుల వేషధారణలను అభినందించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు సునీల్‌కుమార్, మమత, జోనల్ పీఈటీ శ్రీకాంత్, ప్రిన్సిపాల్ సుదేశీ, డీన్ అంజయ్య, ఇన్‌చార్జులు అరుణ్‌కుమార్, ప్రవళిక, హరీష్, అరుణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆకునూరి సుధీర్, పీఈటీలు సుధాకర్, మారుతి, కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 9 తులాల బంగారం, 80 తులాల వెండి, రూ. 2 లక్షల నగదు అపహరణ.

హైదరాబాద్, ఆగష్టు 8:మేడ్చల్ జిల్లా మేడ్చల్ మండలం ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని రావల్ కోల్ పట్టణంలో శనివారం రోజు భారీ చోరీ చోటు చేసుకుంది. రావల్ కోల్ పట్టణానికి చెందిన బందెల ముత్యాలు కుటుంబ సభ్యులతో కలిసి బయటకు వెళ్లిన సమయంలో దుండగులు ఈ ఘాతుకానికి ఒడిగట్టారు.

ఇంటికి తాళం వేసి ఉన్న విషయాన్ని గమనించిన దొంగలు, తలుపులు పగులగొట్టి లోపలికి చొరబడ్డారు. బెడ్‌రూమ్‌లోని అల్మారాలను, లాకర్లను ధ్వంసం చేసి లోపల ఉన్న నగదు, బంగారు ఆభరణాలను దొంగిలించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంట్లో దాచి ఉంచిన 9 తులాల బంగారం, 80 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ. 2 లక్షల నగదును దొంగలు అపహరించుకుపోయారు.

# శాంతియుతంగా పరిష్కరించుకోవాలి

### –పోడు భూముల సమస్యలపై నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

ఆదిలాబాద్, ఆగష్టు 8: పోడు భూములకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి శాంతియుతంగా పరిష్కరించుకోవాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల సూచించారు. అటవీ శాఖ అధికారులు, గ్రామస్తులు పరస్పరం సంయమనం పాటిస్తూ సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని కోరారు.



కడెం మండలంలోని ఉడుంపూర్, గంగాపూర్, రాణిగూడ, కొర్రతండా, అల్లంపల్లి, బాబానాయక్‌తండా గ్రామాల పరిధిలోని పోడు భూములు, అటవీ శాఖకు సంబంధించిన సమస్యలపై అధికారులు, గ్రామ ప్రజలు, రైతులు, ప్రజాప్రతి నిధులతో చర్చలు నిర్వహించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సూచనల మేరకు జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల ఆధ్వర్యంలో సంబంధిత అధికారులు గ్రామస్తులతో సమావేశమై సమస్యలను తెలుసుకున్నారు. నిర్మల్ డీఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బొబడే, అదనపు కలెక్టర్లు కిషోర్‌కుమార్, వెంకటేశ్వర్లు, డీఆర్‌డీవో విజయ లక్ష్మి, ఆర్డీవో దేవదాస్, డీఎస్పీ శ్రీనివాస్, తహసీల్దార్ ఖాజా మొయినుద్దీన్, ఖానాపూర్ సీఐ సత్యనారాయణ, కడెం ఎస్ఐ సాయికిరణ్ తదితరులు చర్చల్లో పాల్గొన్నారు.

సమస్యలను చర్చలతో పరిష్కరించాలి

ఈ సందర్భంగా కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ.. గ్రామాల్లోని సమస్యలను సమగ్రంగా పరిశీలించి పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. చిన్నచిన్న సమస్యలను అటవీ శాఖ అధికారులు, గ్రామపంచాయతీ సమక్షంలోనే పరిష్కరించుకోవాలని సూచించారు. పెద్ద సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

అటవీ శాఖ అధికారులు, గ్రామ ప్రజలు పరస్పరం గొడవలకు వెళ్లకుండా సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. సమస్యలను శాంతియుత వాతావరణంలో చర్చించుకోవడం ద్వారా పరిష్కార మార్గాలను కనుగొనాలని కోరారు.

అధికారులతో జరిగిన చర్చల అనంతరం గ్రామస్తులు సహాయ నిరాకరణ కార్యక్రమాన్ని విరమించుకుని, యథావిధిగా బేస్‌క్యాంప్ వాచర్లు తమ విధులకు హాజరు కావాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

ఈ సమావేశంలో కల్లెడ సర్పంచ్ టి. రుక్మిణీదేవి, సంజీవ్ పటేల్, ఉడుంపూర్ ఉపసర్పంచ్ సరిత ప్రభాకర్, వార్డు సభ్యులు కన్నయ్య, రవీందర్, గంగాపూర్ సర్పంచ్ జంగు పటేల్, రాణిగూడ సర్పంచ్ తొడసం సీతారాం, కొర్రతండా సర్పంచ్ విజయలక్ష్మి, దాసు నాయక్, అల్లంపల్లి సర్పంచ్ కాంత నరేష్, బాబానాయక్ తండా సర్పంచ్ సునీత, మాధవ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు జొన్నాల చంద్రశేఖర్‌గుప్తా మాట్లాడుతూ.. అటవీ శాఖ అధికారులు, గ్రామ ప్రజలు పరస్పరం సంయమనం పాటిస్తూ శాంతియుత వాతావరణంలో సమస్యలను చర్చించుకుని పరిష్కరించుకోవాలని కోరారు.

## కామారెడ్డిలో రహదారిపై నిలిచిన వర్షపు నీరు.. నీటి కుంటలో కూర్చుని బీఆర్ఎస్ కౌన్సిలర్ నిరసన



కామారెడ్డి, ఆగష్టు 8:(నేటినిజం ప్రతినిధి) కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రహదారిపై వర్షపు నీరు నిలిచింది. దీంతో నీటి కుంటలో కుర్చొని బీఆర్ఎస్‌కు చెందిన 46వ వార్డు కౌన్సిలర్ గెరిగంటి లక్ష్మినారాయణ నిరసన తెలిపారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి జిల్లా కేంద్రంలోని కామారెడ్డి నుండి కరీంనగర్ జాతీయ రహదారి అయిన స్టేషన్ రోడ్డు లోని పోలీస్ స్టేషన్ ముందు వరద నీరు ఎటు వైపు కుడా వెళ్లకుండా అక్కడే నిలిచి ఉంది. ఒక ప్రధాన రహదారి ఒక కుంట, ఒక చెరువును తలపిస్తూ రహదారి వెళ్లే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు

ఈ వరద నీటి కుంట వల్ల ప్రమాదాలకు1 గురవుతున్నారు. కావున ఈ నీటి కుంటతో ట్రాఫిక్ జామై వాహనదారులు తీవ్ర స్థాయిలో ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఇదే దారిలో ఉంది. రోగులు, క్షతగాత్రులు ఎమర్జెన్సీ సమయంలో 108 వాహనం, ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ఇతర వాహానాలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు ఇట్టి సమస్యను పరిష్కరించకుంటే అక్కడే దీక్ష చేపడతానని స్పష్టం చేశారు.




## పసిపిల్లల చర్మ సంరక్షణే లక్ష్యంగా..హిమాలయ బేబీకేర్ 'మ్యాచీ మ్యాచీ పీహెచ్' క్యాంపెయిన్ ప్రారంభం




విజయవాడ, ఆగష్టు 8: భారతదేశంలో అత్యంత ఆదరణ పొందిన బేబీ కేర్ బ్రాండ్లలో ఒకటైన హిమాలయ బేబీకేర్ పసిపిల్లల సున్నితమైన చర్మం సహజ పీహెచ్ సమతుల్యతను కాపాడటంపై అవగాహన కల్పిస్తూ 'మ్యాచీ మ్యాచీ పీహెచ్' క్యాంపెయిన్ ప్రారంభించింది. దేశవ్యాప్తంగా పది ప్రాంతీయ భాషల్లో ఈ క్యాంపెయిన్ ద్వారా బేబీ చర్మానికి తగిన పీహెచ్ 5.5 జెంటిల్ రేంజ్ ఉత్పత్తులతో సురక్షితమైన, ఆరోగ్యకరమైన సంరక్షణను అందిస్తుంది. హిమాలయ జెంటిల్ బేబీ షాంపూ, హిమాలయా జెంటిల్ బేబీ వాష్, జెంటిల్ బేబీ లోషన్, జెంటిల్ బేబీ క్రీమ్‌లను పరిచయం చేశారు. బేబీ చర్మం పీహెచ్ కి సమానంగా ఉంటూ చర్మ రక్షణ పొరను కాపాడుతూ, తేమను లాక్ చేస్తూ, తల నుంచి కాళ్ళ వరకు సున్నితమైన సంరక్షణ అందించడంలో ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. ఈ క్యాంపెయిన్‌లో భాగంగా రూపొందించిన డిజిటల్ వీడియో తల్లిదండ్రుల దైనందిన జీవితానికి ఎంతో దగ్గరగా ఉంటుంది. ఇందులో ఒక తల్లి తన బిడ్డకు సరిపోయే మ్యాచింగ్ దుస్తులను ఎంతో ప్రేమగా వేస్తూ, పాప చర్మానికి తగిన పీహెచ్ గురించి తెలియజేస్తుంది. సాధారణంగా తల్లిదండ్రులు చిన్న పిల్లల దుస్తులు, వస్తువుల మ్యాచింగ్‌పై ఎక్కువ శ్రద్ధ చూపుతారు. కానీ, పాప చర్మాన్ని మెత్తగా, ఆరోగ్యంగా, సురక్షితంగా ఉంచడానికి చర్మం సహజ పీహెచ్ ని మ్యాచ్ చేయడం కూడా అంతే ముఖ్యమని ఈ క్యాంపెయిన్ గుర్తు చేస్తుంది. 'మ్యాచీ మ్యాచీ పీహెచ్' అనే సులువైన, గుర్తుండిపోయే ట్యాగ్‌లైన్‌తో రూపొందిన ఈ వీడియో, హిమాలయ బేబీకేర్ పీహెచ్ 5.5 జెంటిల్ రేంజ్ పిల్లల చర్మ సహజ పీహెచ్ సమతుల్యతను కాపాడటానికి, చర్మ రక్షణ పొరకు అండగా ఉండటానికి, తేమను నిలిపి ఉంచడానికి ఎలా సహాయ పడుతుందో చూపుతుంది. పెద్దల చర్మంతో పోలిస్తే చిన్న పిల్లల చర్మం ఎంతో సున్నితంగా ఉంటుందని, దానికి ప్రత్యేకమైన సంరక్షణ అవసరమనే అంశం ఆధారంగా ఈ క్యాంపెయిన్‌ను రూపొందించారు. కేవలం సాధారణ చర్మ సంరక్షణకే పరిమితం కాకుండా, పిల్లల సహజ చర్మ రక్షణ పొరకు తోడ్పడే ఉత్పత్తులను ఎంచుకోవాలని ఇది తల్లిదండ్రులకు సూచిస్తుంది.

## సీఎం పర్యటనకు ఏర్పాటు ముమ్మరం చేయాలి

ములుగు, ఆగష్టు 8:(నేటినిజం ప్రతినిధి) జిల్లాలో ఈ నెల 16న సీఎం పర్యటించనున్నట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. సీఎం పర్యటన సందర్భంగా అభివృద్ధి పనులపై కలెక్టరేట్‌లో ఆమె శుక్రవారం సమీక్ష నిర్వహించారు. సీఎం హైదరాబాద్ నుంచి మేడారం చేరుకుని వన దేవతలను దర్శించుకుని జిల్లాలో పర్యటిస్తారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రోడ్ల పనులకు ములుగులోని గట్టమ్మ సమీపంలోని పైలాన్ ఆవిష్కరించి శంకుస్థాపన చేస్తారన్నారు. పైలాన్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. సమీకృత కలెక్టరేట్, ఇందిరా శక్తి భవన్ పెండింగ్ పనులు ఈ నెల 10లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మేడారం పరిసర ప్రాంతాల్లో రోడ్లు ఆక్రమిస్తూ వ్యాపారాలు చేస్తున్న వారికి జరిమానా విధించి, తగిన చర్యలు చేపట్టాలన్నారు. సీఎం పర్యటన షెడ్యూల్ 12న వెల్లడవుతుందన్నారు. సమావేశంలో కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.